
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
మంగళవారం 12 ఆగస్టు 2025




ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

కార్పొరేషన్‌కు ట్రేడ్ కష్టాలు..!

కర్నూలు నగరంలోని పాతబస్తీ ప్రాంతంలో ఓ పండ్ల వ్యాపారి పాతబకాయిలు సుమారు రూ.37 వేలు ఉన్నాయి. ట్రేడ్ లైసెన్సు చెల్లించాలని ఆ వ్యాపారిని మున్సిపల్ సిబ్బంది ఒత్తిడి చేయడంతో ఓ కార్పొరేటర్ రంగంలోని దిగాడు.. 'ఆయన మాకు బంధువు అవుతాడు. పన్నులు, గిన్నులు చెల్లించేది లేదు..' అంటూ అధికారులకు హుకుం జారీ చేశాడు. ఇలా ప్రతి వార్డులో కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధుల బంధువులు ట్రేడ్ లైసెన్సులు చెల్లించకుండా అడ్డుపడితే.. ఇక ప్రభుత్వానికి ఆదాయం ఎలా వస్తుంది.

- ట్రేడ్ బకాయిల వసూళ్లపై అధికారుల దృష్టి
- అడ్డుపడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు
- నోటీసులు జారీ చేస్తున్న నగర పాలక సంస్థ





కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర పాలక సంస్థకు ఆదాయం రావాలంటే ట్రేడ్ లైసెన్సు ఒక మార్గం. అయితే ఏ వ్యాపారం చేసినా నగర పాలకకు ట్రేడ్ లైసెన్సు తీసుకోవడంతో పాటు ప్రతి సంవత్సరం ఫీజు చెల్లించాలి. ఈ క్రమంలో నగర పాలక పరిధిలో 52 వార్డులు ఉండగా ఇందులో 11,814 మంది ట్రేడ్ లైసెన్సు తీసుకున్నారు. దీంతో నగర పాలక సంస్థకు సంవత్సరానికి రూ.3 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. లైసెన్సు తీసుకుని ఫీజు చెల్లించాలని నగర పాలక అధికారులు దుకాణ యజమానులకు అడుగుతున్నారు. అయితే ప్రజాప్రతినిధులు, స్థానిక కార్పొరేటర్ల అండదండలు చూసుకుని కొందరు వ్యాపారులు తాము ఒక్కపైసా కూడా చెల్లించేది లేదంటూ తెగేసి చెబుతున్నారు. మరీ ముఖ్యంగా లైసెన్సు ఫీజు చెల్లింపులపై వ్యాపారులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది కార్పొరేటర్లు ట్రేడ్ లైసెన్సులు చెల్లించకుండా అడ్డుకుంటున్నట్లు అధికారులే చెబుతున్నారు.

కర్నూలు నగరంలో 50 వేలకు పైగా దుకాణాలు ఉండగా అధికారుల లెక్కల్లో మాత్రం 11,814 దుకాణాలకు లైసెన్సులు ఉన్నట్లు చూపిస్తున్నారు. లైసెన్సుకు నగదు వసూలు చేయని దుకాణాలు సుమారు 25 వేలకు వరకు ఉంటాయి. నగర పాలక పరిధిలో మొత్తం 11,814 మంది ట్రేడ్ లైసెన్సులు తీసుకున్నారు. ఇందులో ఇప్పటివరకు 6,546 మంది మాత్రమే చెల్లించారు. మిగిలిన 5,268 మంది చెల్లించలేదు. పాత బకాయిలు రూ.2,71,79,970 ఉండగా కొత్తవి రూ.50,99,939గా ఉన్నాయి. మొత్తం రూ.3,22,79,909 పెండింగ్ ఉంది. శానిటరీ ఇన్స్‌పెక్టర్లకు ప్రత్యేక డ్యూటీలు వేసి ట్రేడ్ లైసెన్సులు వసూలు చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం వసూలులో ప్రజాప్రతినిధులు అడ్డుకుంటున్నారు.

దోచుకుంటున్నారు

కర్నూలు నగరంలో సుమారు 7 లక్షలకు పైగా జనాభా ఉంది. చిన్న,పెద్ద దుకాణాలు కలిపి 50 వేలకు పైగా సుమారు ఉంటాయి. నగర పాలక పరిధిలో 11,814 దుకాణాలకు మాత్రమే లైసెన్సులు ఉన్నాయి. నగర పాలక ప్రజారోగ్య విభాగం ప్రతి దుకాణం నుంచి లైసెన్సు, రెన్యువల్ వసూలు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ప్రతి సంవత్సరం ఏప్రిల్ ఒకటో తేదీలోగా చేయాలి. ఏప్రిల్ నెలాఖరుకు చెల్లించని వారు 25 శాతం అపరాధ రుసుంతో కలిపి చెల్లించాలి. మే ఒకటో తేదీ నాటికి అన్ని దుకాణాల నుంచి పూర్తిస్థాయిలో వసూలు చేయాలని నిబంధనలు ఉన్నాయి. లేదంటే సంబంధిత అధికారి సొంత సొమ్ము జమచేయాలి. రుసుం చెల్లించిన ప్రతి దుకాణంలోనూ లైసెన్సు ధ్రువీకరణ పత్రం ప్రదర్శించాలి. అయితే నగరంలోని పలు కాలనీల్లో పలువురు దుకాణదారులు ట్రేడ్ లైసెన్సు తీసుకోకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇలాంటి వారికి నగరపాలక అధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

ప్రజాప్రతినిధుల వద్దకు పంచాయితీ

ట్రేడ్ లైసెన్సు ఫీజుల విషయంలో స్థానికంగా ప్రజాప్రతినిధుల కలుగజేసుకుంటుండంతో సమస్య మరింత జఠిలమవుతోంది. దీంతో చాలా మంది కూడా లైసెన్సు తీసుకోవడం లేదు. దీని వల్ల నగర పాలక ఆదాయానికి గండి పడుతోంది. అన్నీ తెలిసినా కూడా ప్రజాప్రతినిధులు వ్యాపారులను వెనుకేసుకుని రావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు యజమానులైతే 'మేం మంత్రితోనే చెప్పిస్తాం. మేము కట్టాల్సిన పనిలేదు..' అని బాహాటంగానే చెబుతున్నారు. దీంతో ఏమిచేయలేని నిస్సహాయ స్థితిలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.



పన్ను వసూళ్లపై ప్రజాప్రతినిధులు భరోసా ఇచ్చారు



నగర పాలక పరిధిలో ట్రేడ్ లైసెన్సు, ఆస్తి, కొళాయి పన్నులు వసూళ్ల చేయించి ఇస్తామని ప్రజాప్రతినిధులు భరోసా ఇచ్చారు. ప్రభుత్వానికి ఆదాయ వనరులుగా భావించే పన్ను వసూళ్లకు ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాము. ఎవరైనా ట్రేడ్ లైసెన్సు చెల్లించని పక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాన్ని సీజ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, వ్యాపారులు గమనించాలని కోరుతున్నాము.

- పి.విశ్వనాథ్, కమిషనర్, నగర పాలక సంస్థ, కర్నూలు

నేడు డీపీఆర్‌సీలో శిక్షణ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు అధికారులకు మంగళవారం ఒక్కరోజు శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా వనరుల శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జి.నాసర రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు, డీపీఓలు, డీఎల్‌పీఓలు, జడ్పీటీసీలు, ఎంపీడీఓలకు శిక్షణ ఉంటుందన్నారు. రాష్ట్ర గ్రామస్వరాజ్య అభియాన్-ఆర్‌జీఎస్‌ఏ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏపీ గ్రామ పంచాయతీ అండ్ గ్రామీణాభివృద్ధి ఉత్తర్వుల మేరకు పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 1.0 నుంచి వెర్షన్ 2.0 వరకు జరిగే వర్క్‌షాపు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ శిక్షణకు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు. అనంతరం ఆయా మండల కేంద్రాలలో ఈనెల 13న మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

మోదీని కలిసిన ఎంపీ బస్తిపాటి


ప్రధాని మోదీతో ఎంపీ బస్తిపాటి

కర్నూలు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్ర మోదీని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సోమవారం ఢిల్లీలో కలిశారు. కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లతో పాటు రాష్ట్ర ఎంపీలు ప్రధానమంత్రిని కలిశారు. ఎంపీల బృందంతో పాటు వెళ్లిన బస్తిపాటి నాగరాజు మోదీకి కరచాలనం చేసి ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై శుభాకాంక్షలు తెలిపారు.

హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు చలపతి నగర్‌లోని పోస్టుమెట్రిక్ మైనార్టీ బాలుర వసతి గృహంలో ఖాళీ సీట్ల కోసం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి సయ్యద్ సబీహా పర్వీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ హాస్టల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 25 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కర్నూలు నగరంలో చదువుతున్న దూర ప్రాంతాలకు చెందిన మైనార్టీ విద్యార్థులు వసతి గృహ ప్రవేశాలకు అర్హులు అని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతి శుక్రవారం రెవెన్యూ గ్రీవెన్స్: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం నిర్దేశించిన మండలంలో రెవెన్యూ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో వాటికి మండల స్థాయిలోనే పరిష్కారం చూపేందుకు ప్రతి శుక్రవారం నిర్దేశించిన ఒక మండలంలో రెవెన్యూ గ్రీవెన్స్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ గ్రీవెన్స్‌కు జాయింట్ కలెక్టర్, ఆర్డీవో హాజరవుతారన్నారు.

త్వరలో 'పల్లెకు పోదాం': జిల్లాలో గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం త్వరలో 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందు కోసం 83 మంది అధికారులను నియమించామని చెప్పారు. గ్రామాల్లో తాగునీరు వైద్య, ఆరోగ్యం, అంగన్‌వాడీ స్కూల్స్, హాస్టల్స్, హౌసింగ్, పారిశుధ్యం, తదితర అంశాలపై అధికారులు తనిఖీ చేసి అందుకు సంబంధించిన నివేదికను 'పల్లెకు పోదాం' పోర్టల్‌లో పొందుపరిచి ఆ సమస్యలను పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జేసీ బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.20వేల కోట్లు కేటాయించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య



సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డయ్య

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.20 వేల కోట్ల నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీఆర్ భవన్‌లో జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, లెనిన్ బాబులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒకప్పుడు రాజధానిగా వెలుగొందిన కర్నూలు జిల్లా ప్రస్తుతం అన్నివిధాలుగా వెనుకబడి ఉందన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు 106 చెరువులను నింపాలన్నారు. పందికోనం, క్రిష్ణగిరి రిజర్వాయర్ల కింద ఆయకట్టు స్థిరీకరణ పనులు పూర్తి చేసి జిల్లాలో లక్ష ఎకరాలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలను ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలన్నారు. రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి రూ.500 కోట్లు నిధులు విడుదల చేయాలన్నారు. ఆదోని, ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్స్ పరిశ్రమల ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 23 నుంచి 25 వరకు ఒంగోలులో సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు కె.జగన్నాథం, జి.చంద్రశేఖర్, కె.శ్రీనివాసులు, రామకృష్ణ, మహేష్, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

వేరుశనగ క్వింటం రూ.6,988


విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ ధరలు సోమవారం క్వింటం గరిష్ఠంగా రూ.6,988 పలికింది. బోరు బావులు, కాలువల కింద సాగిన వేరుశనగ దిగుబడి చేతికందడంతో రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో కల్లాలలో ఆరబెట్టకుండా నేరుగా వేరుశనగను మార్కెట్‌కు తరలిస్తున్నారు. కాగా సోమవారం ఆదోని మార్కెట్‌కు 3,625 బస్తాల వేరుశనగ విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.3,266, గరిష్ఠ ధర రూ.6,988, సగటున ధర రూ.6,491 చొప్పున పలికింది

తుంగాతీరనివాస గోవిందా.. గోవిందా..!

- స్వర్ణ రథంపై రాఘవేంద్రుల విహారం
- బృందావనానికి మహా పంచామృతాభిషేకం
- గజవాహనంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు

6





మంత్రాలయానికి వెండి ప్రభోత్సవాలు



వెండితో తయారు చేసిన చంద్ర ప్రభోత్సవం

మంత్రాలయం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఉడిపి హోటల్, పూజాబాండర్ అధినేతలు రంగాచార్, పరమేషాచార్ భక్తులు 40 కిలోల వెండితో తయారు చేసిన సూర్య చంద్ర ప్రభోత్సావాలను అందజేశారు. సోమవారం సూర్య ప్రభోత్సవంలో ప్రహ్లాదరాయలను ఊరేగించారు. దాతలను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అభినందించి సత్కరించారు.

కిక్కిరిసిన ఉరుకుంద క్షేత్రం

కౌతాళం-ఉరుకుంద రహదారిపై ట్రాఫిక్ జామ్



భక్తుల సందడి

కౌతాళం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం సోమవారం వేలాదిమంది భక్తులతో కిక్కిరిసింది. శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా మూడో సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. దీంతో స్వామివారి దర్శనానికి 3 గంటలకు పైగా సమయం పట్టింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌ను వెండి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయం సమీపంలో ప్రవహిస్తున్న ఎల్లెల్సీలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా ఉరుకుంద-కౌతాళం రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.



ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలు

తుంగాతీరనివాస గోవిందా.. గోవిందా..!

- స్వర్ణ రథంపై రాఘవేంద్రుల విహారం
- బృందావనానికి మహా పంచామృతాభిషేకం
- గజవాహనంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుండెల నిండా భక్తి నింపుకొని.. దేశం నలుమూలల నుంచి వేలాది మంది భక్తజనసందోహంతో తుంగాతీర నివాసుడైన రాఘవేంద్రుడి సన్నిధిలో భక్తులు పరవశించిపోయారు. రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాల్లో ముఖ్యమైన నాలుగో రోజు రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన మధ్యారాధనలో భాగంగా సోమవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి పీఠాధిపతి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రస్వామి బంగారు కవచాన్ని స్వర్ణ రథంపై ఉంచి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మహా మంగళహారతులు ఇచ్చారు. వేలాదిమంది భక్తుల నడుమ స్వామివారి రథం కొనసాగింది. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గజరూప అలంకరుడైన ఉత్సవమూర్తిని నూతనంగా నిర్మించిన పుష్కరిణిలో తెప్పోత్సవంపై అధిష్ఠించి మూడుసార్లు శిలామండపం చుట్టూ విహరించారు. అనంతరం వజ్రాలంకరణలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు ఊంజల సేవ నిర్వహించి చెక్క, వెండి, బంగారు, నవరత్నాల రథాలపై ఊరేగించారు. ఈ వేడుకలో విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ఏఏవో మాధవశెట్టి, ప్రత్యేక అధికారులు కృష్ణ కౌశిక్, శ్రీషా జోయేష్, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, రవి కులకర్ణి, సుజీంద్రచార్, విజయేంద్రాచార్, జయతీర్థాచార్, ఏఈ బద్రినాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, వ్యాసరాజాచార్, డీఎం ఆనందరావు, డీఎస్పీ ఎంఎస్ భార్గవి, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ తదితరులు పాల్గొన్నారు.



అశేష భక్తజనవాహిని మధ్య బంగారు రథంపై ఊరేగుతున్న రాఘవేంద్రులు

అలరించిన నృత్య రూపకం

సోమవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగళూరుకు చెందిన ప్రభాత్ కళావెదరు నృత్య రూపకం, బెంగళూరుకు చెందిన ఆర్కే శంకర్ బృందం వీణావాయిద్యం, బెంగళూరు చెందిన విద్వాన్ రాయచూరు శేషగిరిదాసుచే దాసవాని సాహిత్యం భక్తులను అలరించింది.



బంగారు రథానికి హారతులు ఇస్తున్న పీఠాధిపతి



శ్రీమఠం ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు



పీఠాధిపతి ఇచ్చే మంత్రాక్షితల కోసం చేతులు చాపిన భక్తులు

నేడు రాఘవేంద్రుని మహారథోత్సవం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు ఉత్తరాధనలో భాగంగా మంగళవారం మహారథోత్సవం వైభవంగా జరగనుంది. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు ఈ వేడుకకు తరలిరానున్నారు. ఉదయం రాఘవేంద్రస్వామి బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ హారతులు ఇచ్చి శ్రీమఠానికి చేరుకుంటారు. అనంతరం ఉత్సవమూర్తికి మహా మంగళహారతులు ఇచ్చి వసంతోత్సవంలో భాగంగా రంగులు చల్లుకుంటారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భక్తులనుద్దేశించి దివ్యసందేశాన్ని ఇస్తారు.



గజ వాహనంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు



పుష్కరిణిలో తెప్పోత్సవం



బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

గర్జించిన వంక

- వర్షాలతో గర్జివంకపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు
- ప్రవాహం మరింతే పెరిగితే రాకపోకలు ఉండవు
- ఎత్తైన వంతెన లేకపోవడంతో ప్రజల అవస్థలు
- ఏళ్లుగా ముంపునకు గురవుతున్న 104బసాపురం గ్రామం





104 బసాపురం గ్రామం

ఆదోని/ఆదోని రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వర్షం వస్తే 104 బసాపురం గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాల్సిందే. ఎందుకంటే గ్రామంలో బ్రిడ్జి ఉన్నప్పటికీ బ్రిడ్జిపైకెక్కి పారుతోంది. దీంతో గ్రామంలోకి నీరు రావడం, మరోవైపు పట్టణానికి వెళ్లాలంటే ఆ వరదనీటిలో నుంచి భయభయంగా వెళ్లాల్సిన దుస్థితి ఆ గ్రామస్థులది. ఈ గ్రామానికి ఇటీవల రహదారి నిర్మాణానికి రూ.1.50 కోట్లు నిధులు కూడా మంజూరయ్యాయి. రహదారికి నిధులు మంజూరైనా ఆ గ్రామస్థుల్లో ఆనందం లేదు. ఎందుకంటే గ్రామానికి ఆనుకుని ఉన్న బ్రిడ్జి స్థానంలో ఎత్తయిన వంతెన చేపట్టాకే రహదారిని నిర్మించాలంటూ గ్రామ ఐక్యతతో కలిసి అధికారులను సైతం నిలదీశారు. ముఖ్యంగా గర్జివంక భారీగా ప్రవహిస్తే గ్రామం మునిగిపోతుందని గ్రామస్థులు భయపడుతున్నారు. ఈ క్రమంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గర్జివంతెనపై నడుము లోతుల్లో వరద నీరు పారుతుండడంతో ప్రజలు, విద్యార్థులు అందులో నుంచే ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన ఎత్తు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాకాలం వస్తే చాలు.. ఆ గ్రామస్థులు వణికిపోతున్నారు. ఏటా వానలు వచ్చినప్పుడల్లా ఆ గ్రామ సమీపంలోని గర్జివంక.. గర్జిస్తోంది. బ్రిడ్జిపై నీటి ప్రవాహ ఉధృతికి రాకపోకలన్నీ నిలిచిపోతున్నాయి. జనజీవనం స్తంభించిపోతోంది. ఆదోని డివిజన్ కేంద్రానికి 6 కిలోమీటర్ల దూరం ఉంది ఆ గ్రామం. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. చాలా సంవత్సరాల నుంచి కష్టాలకు గురవుతున్న 104 బసాపురం గ్రామంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం



బ్రిడ్జిపై పారుతున్న నీళ్లలో నిలబడి నిరసన తెలుపుతున్న 104బసాపురం గ్రామస్థులు

స్థానిక సంస్థలను బహిష్కరిస్తాం



ఐదేళ్ల వైసీపీ పాలనలో మా గ్రామాన్ని అసలు పట్టించుకోలేదు. ఈప్రభుత్వంలోనైనా తమ గ్రామం రూపురేఖలు మారతాయని, బ్రిడ్జి నిర్మాణంతో పాటు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎస్సీ కుటుంబాలకు ఉన్న చోటే ఇంటి పట్టాలు ఇస్తారని ఆశిస్తూ ఎదురుచూస్తేనే ఉన్నాం. ఏడాది గడిచినా కూటమి ప్రభుత్వం సైతం తమను పట్టించుకోవడం లేదు. ఇలా అయితే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తాం. మా గ్రామానికి అధికారులను, ప్రజాప్రతినిధులను రానివ్వం. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

● లింగప్ప, బసాపురం గ్రామం, ఆదోని మండలం

వర్షం వస్తే భయమేస్తోంది



వర్షం వచ్చిందంటే భయమేస్తోంది. గర్జివంక ఎప్పుడు గర్జిస్తుందో... గ్రామంలోకి ఎప్పుడు నీళ్లు వస్తాయేమోనన్న భయంతో గడపాల్సిన పరిస్థితి ఉంది. ఆదోనికి కూతవేట దూరంలో ఉన్న గ్రామాన్నే పట్టించుకోని ప్రజాప్రతినిధులు మిగతా గ్రామాలను ఎలా చూస్తారోనన్న అనుమానం కలుగుతుంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది.

●రంగ, బసాపురం గ్రామం, ఆదోని మండలం

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకుని వారికి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా సూచించారు. కర్నూలు కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నైపుణ్యం అభివృద్ధి, శిక్షణ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న జాబ్‌మేళా పోస్టర్లను సోమవారం కలెక్టర్, జేసీ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్య అభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 14న వివిధ రకాలైన 11 ప్రైవేటు కంపెనీల్లో 500 ఖాళీలను భర్తీ చేసేందుకు కర్నూలు బి.క్యాంపులోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు ఉండి పది నుంచి డిగ్రీ, డిప్లొమా, బీటెక్, పీజీ చదివిన వారు జాబ్‌మేళాలో పాల్గొని ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. ముందుగా Naipunyam.ap.gov.in/ యూజర్ రిజిస్ట్రేషన్ లింకులో సదురు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7780478910, 9059290821 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ బి.నవ్య డీఆర్వో వెంటకనారాయణమ్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిపారవశ్యం..

● మంత్రాలయానికి 200 కిలోమీటర్ల నుంచి పాదయాత్ర



సింధనూరు నుంచి మంత్రాలయానికి వస్తున్న భక్తులు

మంత్రాలయం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు కర్ణాటకలోని సింధనూరు పట్టణంలోని దాదాపు 350 మంది మహిళలు, యువకులు, చిన్న పిల్లలు పాదయాత్రతో సోమవారం సాయంత్రం మంత్రాలయం చేరుకున్నారు. శనివారం ఉదయం ప్రారంభించిన పాదయాత్ర సోమవారం మధ్యాహ్నానికి మంత్రాలయానికి చేరుకుంది. పాదయాత్ర సమయంలో వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు లెక్కచేయలేదు. ఇష్టదైవం రాఘవేంద్రస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 30 ఏళ్ల నుంచి రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఇలా పాదయాత్రగా వస్తున్నట్లు భక్తులు తెలిపారు.

దంచికొట్టిన వాన

- 25 మండలాల్లో వర్షం
- అత్యధికంగా కర్నూలు రూరల్‌లో 77.2 ఎంఎం వర్షపాతం
- సి.బెళగల్‌లో అత్యల్పం 7.6 ఎంఎం



పొంగి పొర్లుతున్న వక్కెర వాగు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వాన దంచి కొట్టింది. అత్యధికంగా కర్నూలు రూరల్‌లో 77.2 ఎంఎం అత్యల్పంగా సి.బెళగల్ మండలంలో 7.6 ఎంఎం వర్షం నమోదైంది. ఆగస్టు 13 నాటికి జిల్లాలో 41.1 ఎంఎం వర్షం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటికే 114.9 ఎంఎం వర్షం నమోదైంది. కర్నూలు రూరల్‌లో 77.2 ఎంఎం, ఓర్వకల్లులో 68.2, ఆస్పరిలో 67.3, ఆదోనిలో 58.6, కర్నూలు అర్బన్‌లో 54.4, వెల్దుర్తిలో 42.4 ఎంఎం వర్షపాతం నమోదయింది. పెద్దకడబూరులో 38.6, కోడుమూరులో 34.6, కల్లూరులో 34.2, కౌతాళంలో 30.8, ఎమ్మిగనూరులో 30.2, క్రిష్ణగిరిలో 21.6, పత్తికొండలో 24.6, దేవనకొండలో 21.2, గూడూరులో 20.4, గోనెగండ్లలో 22.6, నందవరంలో 20.8, కోసిగిలో 14.2, మద్దికెరలో 17.2, ఆలూరులో 14.4 తదితర మండలాల్లో 7 నుంచి 13 ఎంఎం వర్షం నమోదైంది. ఊహించని రీతిలో వర్షం పడటంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలకు తెగుళ్లు, క్రిమికీటకాలు కొంత వరకు తగ్గుతాయని, ఇప్పటి నుంచి మరో వారం రోజులు ఎండలు బాగా కాస్తే పైర్లు బాగుంటాయని వారు అభిప్రాయపడుతున్నారు.



వెంగలాయదొడ్డి చెరువు నిండి తూము ఎక్కి పారుతున్న వర్షపునీరు

పంటలకు జీవం

ఆస్పరి: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఆస్పరిలో సుమారు 67.2 ఎంఎం వర్షపాతం నమోదయింది. ఏకధాటిగా రాత్రంతా కురవడంతో వర్షపునీరు పంట పొలాలను ముంచెత్తింది. ఖరీఫ్ సీజన్‌లో వేసిన పత్తి, ఉల్లి, వంకాయ, టమోటా, చౌళకాయ పంటలన్నీ జీవం పోసుకున్నాయి.

పొంగి పొర్లిన వాగులు, వంకలు

కల్లూరు: కల్లూరు మండలంలో సోమవారం తెల్లవారుజామున 4 సెంటీమీటర్ల వర్షం పడింది. ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. దీంతో హంద్రీ నది, వక్కెర వాగులను వరద ప్రవాహం కొనసాగింది. ఖరీఫ్ సీజన్‌లో కురిన వర్షం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, కంది, ఉల్లి, మిరప, మినుము పంటలకు వర్షం చాలా ఉపయోగకరమని అధికారులు తెలుపుతున్నారు.

శ్రీమఠం గోశాల గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

- దాదాపు 1500 ట్రాక్టర్ల పశుగ్రాసం దగ్ధం
- దెబ్బతిన్న గోడౌన్ ● సుమారు రూ.60 లక్షల ఆస్తి నష్టం



శ్రీమఠం గోశాల గోడౌన్‌లో కాలిపోతున్న పశుగ్రాసం

మంత్రాలయం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాల గోడౌన్‌లో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పురవ్వలు పశుగ్రాసంపై పడటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అక్కడే ఉన్న సూపర్‌వైజర్ రాఘవేంద్ర దేశాయ్ గోశాల సిబ్బందితో పశువులను మంటలకు దూరంగా తరలించి కాపాడారు. శ్రీమఠం అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, ఏఈ బద్రీనాథ్ ఘటనా స్థలానికి చేరుకుని రెండు ఫైరింజన్లు, ఆరు ట్రాక్టర్ల ట్యాంకర్లు, నాలుగు ఎక్స్‌కవేటర్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. దాదాపు 6 గంటల పాటు మంటలు అదుపు కాలేదు. దీంతో అప్పటికే అందులో ఉన్న దాదాపు 15వేల గ్రాసం చుట్టలు, కర్ణాటక భక్తులు విరాళంగా ఇచ్చిన 15 వేల గ్రాసం చుట్టలు కాలిపోయాయి. విశాలమైన గోడౌన్ సైతం మంటలకు పూర్తిగా దెబ్బతింది. అధికారులు అప్రమత్తం కావడంతో భారీ నష్టం జరగకుండా చర్యలు చేపట్టడంతో రూ.60 లక్షల నష్టం వాటినట్లు శ్రీమఠం అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. దాదాపు 2వేల గోవులకు ఏడు నెలలకు సరిపోయే గ్రాసం దగ్ధం అయింది.

చెరువు తూములో పడి వ్యక్తి మృతి

పెద్దకడబూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువు తూములో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో జరిగింది. సోమవారం ఏఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాలివీ.. మాధవరం గ్రామానికి చెందిన తెలుగు రఘు(32) గత 6నెలల నుంచి భార్య గ్రామమైన చిన్నతుంబళం గ్రామంలోనే నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 9న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రఘు కోసం గాలింపు చేపట్టారు. అయితే సోమవారం చిన్నతుంబళం సమీపంలో ఉన్న చెరువు తూములో నుంచి ఓ మృతదేహం కాలువలో కొట్టుకురావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటకు తీసి విచారించారు. అదే గ్రామానికి చెందిన రఘు మృతదేహంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రఘు భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ఆనంద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. రఘుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆపరేషన్ సింధూర్ విజేత మోదీ: ఎంపీ శబరి

నంద్యాల రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శత్రు దేశాలకు భారత సైనిక శక్తి, సామర్థ్యాలు తెలియజేసి, ఆపరేషన్ సింధూర్ విజేతగా ప్రధాని మోదీ నిలిచారని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. ఆపరేషన్ సింధూరు విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం ఆమె కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఢిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయంలో మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.



మోదీని సత్కరిస్తున్న ఎంపీ శబరి

రాఘవేంద్రుని సన్నిధిలో కన్నడ సినీ నటులు



మంత్రాలయంలో కన్నడ సినీ నటుడు జగ్గేష్

మంత్రాలయం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కన్నడ ప్రముఖ సినీ నటులు జగ్గేష్, చైన్ శెట్టి, అలాగే టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి సోమవారం వేరు వేరు సమయాల్లో దర్శించుకున్నారు. రాఘవేంద్రస్వామి బృందావనం సజీవంగా బృందావనమైన దినాన్ని పురస్కరించుకుని బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, మెమెంటో అందజేసి పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, వరదేంద్రాచార్, వ్యాసరాజాచార్, జయతీర్థాచార్, రవి కులకర్ణి, ద్వారపాలక అనంత స్వామి పాల్గొన్నారు.

తల్లి హత్య కేసులో కొడుకు అరెస్టు

కర్నూలు క్రైం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి బుధవారపేటలో ఈ నెల 8వ తేదీ జరిగిన రుద్రాక్ష ఎల్లమ్మ హత్య కేసులో ఆమె కొడుకు జమ్మన్నను పోలీసులు అరెస్టు చేశారు. జమ్మన్న మద్యానికి బానిసై తాగడానికి తల్లి డబ్బులు ఇవ్వడం లేదని ఆమె చెవికి ఉన్న కమ్మలు లాకునేందుకు ఎల్లమ్మను నోరు, ముక్కు మూసి ఊపిరాడకుండా చేశాడు. దీంతో ఎల్లమ్మ మృతి చెందింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు జమ్మన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

బావిలో పడి భక్తుడి మృతి

కౌతాళం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు ప్రమాదవశత్తు కాలుజారి బావిలో పడి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని ఉరుకుంద మజరా గ్రామం తిమ్మాపురంలో జరిగింది. వివరాలివీ.. మహబూబ్ నగర్ జిల్లా హనుమాన్‌పుర గ్రామానికి చెందిన పెడింటి అనిల్ కుమార్(40) తమ బంధువు వీరమ్మ కుటుంబంతో కలిసి స్వామి దర్శనానికి ఆదివారం వచ్చారు. వీరతిమ్మాపురం గ్రామ చావిడి వద్ద ఉన్న బావిలో సోమవారం ఉదయం స్నానం చేశాడు. అందరూ కలిసి స్నానం చేసి స్వామి దర్శనానికి వెళ్లడానికి సిద్ధమవుతుండగా అనిల్ కుమార్ దుస్తులు ఉతికేందుకు బావిలో దిగగా కాలుజారి పడిపోయారు. వెంటనే అక్కడే ఉన్న గ్రామస్థులు బావిలో వెతికి అనిల్ కుమార్‌ను బయటకు తీశారు. అప్పటికే అనిల్ కుమార్ మృతి చెందారు. వీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కౌతాళం ఏఎస్‌ఐ రమణారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వెల్దుర్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని బైకు ఢీ కొన్న ఘటనలో అక్క, తమ్ముడికి, మరొకరికి గాయాలు కాగా.. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలివీ.. మండలంలోని బోయినపల్లి గ్రామానికి చెందిన వడ్డె కల్యాణి, వడ్డె అజయ్ అక్క, తమ్ముడు. అక్క కల్యాణి గర్భిణి కావడంతో ఉలిందకొండ పీహెచ్‌సీకి వెళ్లారు. ఆరోగ్య పరీక్షల అనంతరం ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. అయితే వెల్దుర్తి సమీపంలో జాతీయరహదారి-44 గాయత్రీదేవి దేవాలయం వద్ద వెనుక వస్తున్న గద్వాల జిల్లా నంది గ్రామానికి చెందిన జగదీశ్ బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కల్యాణి, తమ్ముడి అజయ్‌కు స్వల్ప గాయాలు కాగా.. జగదీశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. నేషనల్ హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జగదీశ్‌ను కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు.

ఎన్‌క్లోజర్‌లో దుప్పిలపై
రేస్ కుక్కల దాడి

- ఆరు దుప్పిలు హతం
- మరో 17 దుప్పిల మాయం?
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



దుప్పిలు (ఫైల్)

ఆత్మకూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నల్లమలలో మరో విషాదం చోటుచేసుకుంది. పులుల ఆహారం కోసం తీసుకొచ్చిన దుప్పిలను రేస్ కుక్కలు మట్టుపెట్టాయి. ఇందులో అటవీ అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల కాలంలో నల్లమలలో పులి ఆహారమైన గడ్డితినే జంతువుల (హెర్బీవోర్స్) సంఖ్య తగ్గుముఖం పట్టడంతో వాటి సంఖ్యను సమతుల్యం చేసేందుకు అటవీశాఖ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఈక్రమంలోనే ఇతర ప్రాంతాల నుంచి హెర్బీవోర్స్‌ను నల్లమలకు రప్పించి పులి ఆహారానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం పరిసర ప్రాంతాల్లో సంరక్షణలో ఉన్న 23 దుప్పిలను నల్లమలకు తీసుకొచ్చారు. వాటిని ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని బైర్లూటి రేంజ్‌లో గల సుద్దకుంట పరిసర ప్రాంతాల్లో వన్యప్రాణుల ఆవాసంలోని ఎన్‌క్లోజర్‌లో ఉంచారు. కానీ ఎన్‌క్లోజర్‌లో ఊహించని విషాదం చోటు చేసుకోవడంతో అటవీ అధికారులు సైతం కలవరపాటుకు గురయ్యారు. అయితే ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులు అత్యంత గోప్యంగా ఉంచారు.

రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ఎన్‌క్లోజర్

బైర్లూటి రేంజ్ పరిధిలో తొలిసారిగా రెండున్నర ఎకరాల్లో రూ.12లక్షల వ్యయంతో దుప్పిల కోసం ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్‌ను ఏర్పాటు చేశారు. ఆరు అడుగుల ఎత్తులో ఇనుప ఫెన్సింగ్‌తో పాటు అవి బయటకు కనిపించకుండా గ్రీన్ మెష్‌తో కప్పి ఉంచారు. లోపలకు వచ్చేందుకు.. బయటకు వెళ్లేందుకు ద్వారాలను ఏర్పాటు చేశారు. అదేక్రమంలో ఎన్‌క్లోజర్‌లో అడవి తలపించే ప్రాంతంతో పాటు సహజ సిద్ధమైన నీటి వనరులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఎన్‌క్లోజర్‌లో సుమారు మూడు వారాల పాటు దుప్పిలను బంధించి అవి అడవిలో సహజసిద్ధంగా జీవనం సాగించే విధంగా మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తారు. ఎన్‌క్లోజర్‌లో ఉన్న దుప్పిలు అడవిలో జీవించగలుతాయన్న నమ్మకం కలిగినప్పుడు వాటిని అడవుల్లో వదిలేస్తారు.

ఆరోజు రాత్రి ఏం జరిగిందంటే..

ఈ నెల 8వ తేది రాత్రి ఎన్‌క్లోజర్‌లో దుప్పిలు ఉన్నట్లు గుర్తించిన రేస్ కుక్కలు ఇనుప ఫెన్సింగ్ ఎక్కి మరీ అందులోకి ప్రవేశించి దాడి చేశాయి. వాటి అరుపులను గమనించిన అక్కడున్న సిబ్బంది అప్పటికప్పుడు ఎన్‌క్లోజర్ ద్వారాలను తెరచడంతో మరికొన్ని దుప్పిలు అక్కడి నుంచి తప్పించుకున్నాయి. కాగా ఆ సమయంలో ఓ చిరుత పులి ఓ దుప్పిని ఎత్తుకెళ్లినట్లు అటవీ అధికారులు భావిస్తున్నారు. మొత్తానికి ఆరు దుప్పిలు హతమైనట్లు అటవీ అధికారులు గుర్తించి వాటి కళేబరాలకు వెటర్నరీ డాక్టర్లచే పోస్టుమార్టం చేసి వాటిని ఎన్‌క్లోజర్ సమీపంలో దహనం చేశారు. అయితే రేస్ కుక్కలు ఉన్న ప్రదేశంలో దుప్పిలకు రక్షణ లేకుండా ఎన్‌క్లోజర్‌ను ఏర్పాటు చేయడం, అది కూడా తక్కువ ఎత్తులో ఇనుప ఫెన్సింగ్ ఉంచడంపై విమర్శలు ఉన్నాయి.



దుప్పిని హతమార్చుతున్న రేసుకుక్క (ఫైల్)

ఇలాంటి ఘటన ఎప్పుడు జరగలేదు



నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో ఇప్పటికే పలు డివిజన్లలో ఎన్‌క్లోజర్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ఇలాంటి ఘటన ఎన్నడూ జరగలేదు. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాము. అదేక్రమంలో ఎన్‌క్లోజర్ ఇనుపు ఫెన్సింగ్ ఎత్తును పెంచడంతో పాటు అందులోకి ఇతర వన్యప్రాణులు ప్రవేశించకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశాము. బైర్లూటి రేంజ్ పరిధిలో నల్లకాల్వ సమీపంలో మరో ఎన్‌క్లోజర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నాము. దీనిని 8 అడుగుల ఎత్తు వరకు ఇనుప ఫెన్సింగ్‌తో తయారు చేస్తున్నాము.

- అబ్దుల్ రవూఫ్, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు

మట్కా వ్యసనం..
ఆలయంలో చోరీ..!

- 4 కిలోల వెండి, 10 గ్రాముల బంగారు అపహరణ
- ఆలయ పూజారే నిందితుడు



దేవాలయంలో చోరీకి గురైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆదోని, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జూదం కుటుంబాలను చిన్నాభిన్నం చేయడమే కాదు.. దొంగతనాల చేయించి జైలుపాలు చేస్తుంది. మట్కా బారిన పడిన ఓ పూజారి అప్పులు అధికమై ఏమి చేయాలో తెలియక ఏకంగా దేవుడి ఆభరణాలనే కాజేశాడు. రూ.5లక్షల విలువ చేసే వెండి, బంగారు ఆభరణాలను చోరీ చేసి, పోలీసులకు చిక్కి కటకటాలపాలైన సంఘటన ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం డీఎస్పీ హేమలత విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో వెలిసిన వసిగేరప్పస్వామి దేవాలయంలో స్వామి కోసం చేయించిన 4.386 కిలోల వెండి ఆభరణలతో పాటు 10 గ్రాములు బంగారు నగలను అదే దేవాలయంలో పూజారిగా పనిచేస్తున్న గొర్రెల వసిగేరప్ప దొంగలించాడు. నెలరోజుల క్రితం అపేడున్న ఇస్వీ ఎస్‌ఐకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి అనుమానితుడు గొర్రెల వసిగేరప్పను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆలయంలో దేవుడు సొమ్మును తానే దొంగలించినట్లు వసిగేరప్ప ఒప్పుకున్నాడు. మట్కా ఆడడం తనకు అలవాటుగా మారి పెద్ద ఎత్తున అప్పులు చేశానని పోలీసుల ఎదుట విలపించాడు. దొంగలించిన నగలను విక్రయించి అప్పులను తీర్చాలని అనుకున్నట్లు తెలిపాడు. అయితే ఇంట్లో ఉంచిన వెండి, బంగారు ఆభరణాలను విక్రయించేందుకు కర్ణాటక రాష్ట్రం బళ్లారి పట్టణానికి తరలిస్తుండగా ఇస్వీ పోలీసులు చాగి గ్రామం సమీపంలో వసిగేరప్పను అదుపులోకి తీసుకుని విచారించామని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ నల్లప్ప, ఇస్వీ ఎస్‌ఐ నాయక్, తాలూకా ఎస్‌ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అరెస్టు హేయం

- ఏఐసీసీ సభ్యుడు లక్ష్మీనరసింహ యాదవ్

కల్లూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికల కమిషన్‌ను డిజిటల్ ఓటర్ లిస్ట్ ఇవ్వాలని, ఓటర్ జాబితాలో తప్పుల తడకగా ఉందని ధర్నా చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి నాయకులను అరెస్ట్ చేయడం హేయమని ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. దామోదరం సంజీవయ్య కాంగ్రెస్ భవన్‌లో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ బయట పెట్టిన నిజాలకు సమాధానం చెప్పలేక అరెస్టులు చేస్తారా? అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియను కలుషితం చేశారని, బీజేపీ అధికారం కోసం ఈసీ వ్యవహరిస్తున్న తీరుపై అనుమానం కలుగుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు పునాదిలాంటిదని, అయితే ఓటును ఎన్నికల కమిషన్ విలువ లేకుండా చేసిందని అన్నారు. విచ్చలవిడిగా నకిలీఓట్లు, డబుల్ ఓట్లుతో బీజేపీ గెలుపుకు ఈసీ సహకరిస్తోందని విమర్శించారు. అదేక్రమంలో ప్రతిపక్ష నాయకుడు అడిగిన డిజిటల్ ఓటర్ జాబితా ఎందుకు ఇవ్వడం లేదని, సీసీటీవీ ఆధారాలు ఎందుకు నాశనం చేశారని, నకిలీ ఓటర్ల జాబితా ఎందుకు తారుమారు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతలను ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పఠాన్ అబిఖాన్, విశ్వేశ్వరరెడ్డి, రజాక్‌వలి, వెంకటనాయుడు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విచారించి న్యాయం చేస్తాం: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. నగరంలోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 81 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

కర్నూలు అశోక్‌నగర్‌కు చెందిన వినయ్ కుమార్ నా భార్యకు కడప రిమ్స్‌లో స్టాఫ్ నర్సు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.1.50 లక్షలు తీసుకుని మోసం చేశారని నంద్యాల పట్టణానికి చెందిన ప్రదీప్ ఫిర్యాదు చేశారు.ఆధార్ సెంటరు ఇప్పిస్తామని చెప్పి కర్నూలు బుధవారపేట చెందిన బోయ రాజశేఖర్ రూ.60వేలు తీసుకుని మోసం చేశారని మంత్రాలయానికి చెందిన వీరేష్ ఫిర్యాదు చేశారు. పసుపుల,రుద్రవరం నూతనపల్లె గ్రామాల రైతుల నుంచి పసుపుల గ్రామంకు చెందిన పకిడి ఖాజా క్వింటాళ్లలో పొగాకు కొనుగోలు చేసి అమ్ముకుని డబ్బులు ఇవ్వకుండా పలువురు రైతులను మోసం చేస్తున్నారని కర్నూలు మండలం పసుపుల గ్రామానికి చెందిన సుల్తాన్ ఫిర్యాదు చేశారు. తమ 5 ఎకరాల పొలానికి వెళితే గుర్రం నాగన్న, వెంకటస్వామి, వెంకట్రాముడు, ఉపేంద్రలు కొట్టడానికి వస్తున్నారని, సర్వే చేయించడానికి వారు సహకరించేలా చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన కనకమ్మ ఫిర్యాదు చేశారు. కర్నూలు చెందిన రవీంద్ర అనే వ్యక్తి పాతబస్తీ, పూలబజారుకు చెందిన కొంత మంది మహిళల నుంచి ఆధార్ కార్డు, పాన్‌కార్డు, సిమ్‌కార్డు ఫోటోలు తీసుకుని ఒక్కొక్కరికి రూ.5వేల నుంచి రూ.10వేల మాదిరిగా ఇచ్చి బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేస్తూ వారికి తెలియకుండా వారి పేర్ల మీద ఏసీలు, టీవీలు, సెల్‌ఫోన్లు తీసుకుని మోస్తం చేస్తున్నాడని కర్నూలు వడ్డెగేరికి చెందిన షేక్ సన ఫిర్యాదు చేశారు. తమకు ప్రాణరక్షణ కల్పించి న్యాయం చేయాలని కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లెకు చెందిన చిట్టెమ్మ ఫిర్యాదు చేశారు. ఫోర్జరీ పట్టాదారు పాసు పుస్తకాలు తయారు చేసుకుని రాజు, మహేష్ అనే వ్యక్తులు ఆస్తిని ఆక్రమించుకోవాలని నన్ను, తన నానమ్మను కొట్టి చంపుతామని బెదిరిస్తున్నారని ఆదోని పట్టణం రాహుల్ ఫిర్యాదు చేశాడు.

ఆర్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



భూమిపూజ చేస్తున్న టీజీ వెంకటేశ్, ఆర్ఎస్ఎస్ నాయకులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశ సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షిస్తూ ప్రతిరంగంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నగర శివారు మునగాలపాడు వద్ద 10 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న కేశవ స్మృతి మండలి నూతన భవన నిర్మాణానికి అచలానంద స్వామి ఆధ్వర్యంలో సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ ఆర్ఎస్ఎస్ ప్రతినిధులతో కలిసి భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం టీజీ మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచే పెద్దలను గౌరవించే సంస్కృతి, దేశం పట్ల భక్తి అలవడేలా ఆర్ఎస్ఎస్ ఎంతో కృషి చేస్తోందన్నారు. బాల్యం నుంచి పిల్లల్లో క్రమశిక్షణ అలవడితే తద్వారా సమాజం, దేశం అభివృద్ధి చెంది బలంగా తయారవుతుందన్నారు. సంఘ శాఖలో క్రమశిక్షణ అలవర్చుకొని తమ కుటుంబాలను కూడా వదులుకొని సమాజం కోసమే జీవితాలను అంకితం చేసిన వారిని ఎంతో మందిని కూడా ఇక్కడ చూడవచ్చని అన్నారు. అలాంటి సంస్థ చేపట్టినటువంటి కార్యక్రమాల్లో తాను కూడా భాగస్వామ్యం కావడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు టీజీ వెంకటేశ్ తెలిపారు. సంస్థ చేపడుతున్న కేశవ స్మృతి మండలి నిర్మాణానికి తన తల్లి దివంగత శ్రీమతి గౌరమ్మ పేరు మీద ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముందుముందు కూడా ఆర్ఎస్ఎస్ సంస్థ చేపట్టే ఎటువంటి కార్యక్రమాలకైనా తన వంతుగా పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు ఉంటాయని టీజీ వెంకటేశ్ హామీ ఇచ్చారు. నూతన భవన నిర్మాణానికి టీడీపీ నాయకుడు పుసులూరు ప్రభాకర్ రెడ్డి రూ.12.35 లక్షలు విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో స్థలదాతలు భగవాన్ బాలసాయి సెంట్రల్ ట్రస్టీ రామారావు, ఆదర్శ అనంతయ్య, ఆర్ఎస్ఎస్ అఖిల భారత సేవా ప్రముఖ్ సెంథిల్, క్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, నగర మేయర్ బీవై రామయ్య, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రిలో చోరీ

- నాలుగు తులాల బంగారు, 60 తులాల వెండి అపహరణ

చాగలమర్రి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చింతలచెరువు రహదారిలో నివాసం ఉండే బసిరునిస్సా అనే మహిళ ఇంట్లో చోరీ జరిగింది. ఈనెల 4న బసిరునిస్సా బంధువుల ఇంటికి వెళ్లింది. సోమవారం సాయంత్రం రాగా ఇంటికి వేసిన తాళం తీసిఉండటంతో ఆశ్చర్యపోయింది. ట్రంక్కు పెట్టె పగులకొట్టి నాలుగు తులాల బంగారు, 60తులాల వెండి ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దాంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.



ADMISSIONS

A.P. Open School వారి10th లేదా ఇంటర్‌లో ఒకే సం॥లో పూర్తి మరియు డిగ్రీ, PG అడ్మిషన్స్ కొరకు సంప్రదించండి. Cell: 93946 68667.

AJL-236832

CHANGE OF NAME

I, KADU MINHAJUDDIN S/o. KADU KHAJA MOHIDDIN, R/o.H.No:5-141, Peta, Near Osmania College Road, Kurnool dist, AP., I have changed my father's name from KADU KHAJA MOHIDDIN To KADU KHAJA MOHIUDDIN

AJL-NDL

CHANGE OF NAME

I, ISHRATH SULTHANA (Old Name) R/o. H.No: 30-72A, Chittari Street, Kurnool dist, AP., have Changed my name as ISHRATH SULTANA (New Name) W/o.SHAIK MAHABOOB BASHA

AJL-NDL

FOR ADVERTISEMENTS CONTACT. Cell: 99854 11369

CHANGE OF NAME

I, Bande Abdul Razak, S/o Bande Abdul Kabeer, residing at 1/557, Khooni Mohalla, Adoni-518301, Kurnool district, Andhra Pradesh, hereby declare that I have changed my name from Bande Abdul Razack (old name) to Bande Abdul Razak (new name).

AJL-247603

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.

AJA- 237943

WANTED

కర్నూలు మరియు కడప జిల్లాలలో ప్రభుత్వ మరియు ప్రవేటు బ్యాంక్స్ & NBFC లలో Personal loans, Business loans, Home loans ఇవ్వడానికి Inter, Degree అర్హత కలిగిన Male Female అభ్యర్థులు కావలెను. 20K Salary మరియు Insentive యివ్వబడును. Contact No: 9177767017, 9441608868

AJA-237785

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

అర్జీల పరిష్కారంలో కాలయాపన తగదు



కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో కాలయాపన చేయకుండా తక్షణమే పరిష్కరిం చాలని కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి టిడ్కో ఇళ్లు, కాలనీల్లో డ్రైనేజీ, తాగునీటి వసతి, ఆక్రమణలు తొలగించాలని అర్జీలు వచ్చాయి. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి విభాగానికి వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఈ శేషసాయి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఇన్‌చార్జి ఆర్‌ఓ వాజిద్, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

● నిర్మల్ నగర్‌లోని మున్సిపల్ పార్కును ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి హుసేన్ బాషా కోరారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. హుసేన్ బాషా మాట్లాడుతూ పార్కులో అభివృద్ధికి నోచుకోకపోవడంతో తాగుబోతులకు అడ్డాగా మారిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాజా, వీరేష్, స్థానికులు వెంకటేష్, దుర్గేష్, గాడెప్ప పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోండి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బ్యాంకు సేవలను వినియోగదారులు వినియోగించుకోవాలని కరూర్ వైశ్యాబ్యాంక్ సీఈఓ రమేష్‌బాబు సూచించారు. నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో కరూర్ వైశ్యాబ్యాంక్ నూతన బ్రాంచ్‌ను కమిషనర్ పి.విశ్వనాథ్, కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సావిత్రి, బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రమేష్‌బాబు సోమవారం ప్రారంభించారు.

'ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న పాలకులు'

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించకుండా ప్రజాధనాన్ని పాలకులు దుర్వినియోగం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. సోమవారం సీపీ ఎం ప్రతినిధి బృందం టిడ్కో ఇళ్లను పరిశీలించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ తాగేం దుకు నీరు సరిగ్గా రావడం లేదని.. రెండు రోజులకు ఒక్కసారి ట్యాంకర్ పంపుతున్నట్లు ప్రజలు చెబుతున్నారన్నారు. దొంగల భయంతోపాటు కాపురాలు లేని ఇండ్లకు తలుపులు చెదలు పడుతున్నాయన్నారు. వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఇబ్బందిగా మారిందన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.రాముడు, రాజశేఖర్, అలివేలు, సి.గురుశేఖర్ పాల్గొన్నారు.

జీవోను రద్దు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ కార్పొరేట్ విద్యాసంస్థల ప్రయోజనాల కోసం తీసుకువచ్చిన జీవోను తక్షణమే రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట జీవో కాపీలను విద్యార్థి సంఘాల నాయకులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కులను హరించేలా ప్రభుత్వ పాఠశాలలోకి జూనియర్ కళాశాలలలోకి విద్యార్థి సంఘాలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ఆగస్టు 1న విడుదల చేసిన జీవోను వారు తీవ్రంగా ఖండించారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కోర్టులో

G.O.P. No. 33/2025

గొగటి సుభాస్కర్ రెడ్డి @
గొంగటి సుభాస్కర్ రెడ్డి ....అర్జీదారు
(ఎదురి)
లేరు ... రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కల్లూరు మండలం, కల్లూరు గ్రామము మరియు ఓర్వకల్ మండలం, నన్నూరు గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా పై నంబరు G.O.P. లో గొంగటి.హారిక, వయస్సు 12 సం॥లు మైనరుగా ఉన్నదని మైనరు గార్డియన్‌గా పై కనబరచిన అర్జీదారు. గొంగటి. సుభాస్కర్ రెడ్డి, తండ్రి గొంగటి. బిచిరెడ్డి, వయస్సు 41 సం॥లు, ప్లాట్ నెం.81, IHSDP కాలనీ, కల్లూరు, కర్నూలు సిటీ అను నతడు తనను గార్డియన్‌గా నియమిం చమని మరియు మైనరు సంరక్షణార్థము షెడ్యూలు దాఖలా ఆస్తిని విక్రయించి మైనరు పేర డిపాజిట్ చేయుటకు పర్మిషన్ ఇప్పించమని కోరుతూ పైకోర్టులో అర్జీదాఖలు చేసియున్నాడు. ఇందులో ఎవ్వరికైన ఆక్షేపణలు వున్న యెడల **01-09-2025వ తేది పగలు 10:30 గం॥లకు** పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానించబడును.

షెడ్యూలు: Item No.2 of schedule proprety in Doc.No.1764/2019 of SRO orvakal. Land in Sy.Nos. 284/1, 284/2 pike (Extent of 0.01 1/2 cents or 72.6 Sq.yards) of Kottalatota chenu, within the sub registration of orvakal and district registration of kurnool, with all easement right, with the following boundaries: **East:** Site Sold to Palle Santosh Reddy, **West:** Site Sold to Gongati Sravani, **North:** Anganawadi School, **South:** 16 feet width Rastha.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

బి.పుల్లయ్య, అర్జీదారు పరం అడ్వకేటు, కర్నూలు. సెల్: 94404 58484

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కోర్టులో

G.O.P. No. 36/2025

Gogatti సుభాషిణి @
గొంగటి సుభాషిణి .... అర్జీదారురాలు
(ఎదురి)
లేరు ... రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కల్లూరు మండలం, క్రిష్ణనగర్ కాలనీ మరియు ఓర్వకల్ మండలం, నన్నూరు గ్రామ ప్రజలకు తెలియజేయడమేమనగా పై నంబరు G.O.P. లో జి. అజయ్‌కుమార్ రెడ్డి, వయస్సు 13 సం॥లు మైనరుగా ఉన్నాడని, మైనరు గార్డియన్ గా పై కనపరచిన అర్జీదారు గొంగటి సుభాషిణి, భర్త జి.రవీంద్ర రెడ్డి, వయస్సు:35 సం॥లు R/o.D.No:80-76-12, క్రిష్ణానగర్, కర్నూలు అను ఆమె తనను గార్డియన్‌గా నియమించమని మరియు మైనరు సంరక్షణార్థము షెడ్యూలు దాఖలా ఆస్తిని విక్రయించి మైనరు పేర డిపాజిట్ చేయుటకు పర్మిషన్ ఇప్పించమని కోరుతూ పైకోర్టులో అర్జీదాఖలు చేసియున్నారు. ఇందులో ఎవ్వరికైన ఆక్షేపణలు వున్న యెడల **01-09-2025వ తేది పగలు 10:30 గం॥లకు** పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానించబడును.

షెడ్యూలు: Item No.2 of schedule proprety in Doc.No.1762/2019 of SRO orvakal. Land in Sy.Nos. 284/1, 284/2 pike (Extent of 0.01 1/2 cents or 72.6 Sq.yards) of Nannur(V), Orvakal (M), Kurnool (Dt) which as part of kottalatota chenu,with the sub registration of orvakal and district registration of kurnool, with all easement right, with the following boundaries: **East:** Site Sold to Gongati Sravani, **West:** Rastha, **North:** Anganawadi School, **South:** 16 feet width Rastha.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

బి.పుల్లయ్య, అర్జీదారు పరం అడ్వకేటు, కర్నూలు. సెల్: 94404 58484

కానిస్టేబుళ్లను అభినందించిన జేసీ

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో చదువుతూ 17 మంది కానిస్టేబుళ్లుగా ఎంపి కైన అభ్యర్థులను జాయింట్ కలెక్టర్ బి.నవ్య అభినం దించారు. సోమవారం జా యింట్ కలెక్టర్ కార్యాల యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆధ్వర్యంలో అభ్యర్థులు మర్యాదపూర్వ కంగా జేసీని కలిశారు. అభ్యర్థులు భవిష్యత్తులో ఇంకా మంచి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్, అభ్యర్థులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

సి.బెళగల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌లో బాషా అనే రైతు సాగు చేసి న పత్తి పంటను వ్యవసాయాధికారి మల్లేష్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ పత్తి పంటకు వచ్చే పచ్చపురుగుపై రైతులు దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు. వేపనూనె, మోక్రోటోపాసును కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచిం చారు. ఎంపీఈవోలు వెంకటేశ్వర్లు, ఈశ్వర్ ఉన్నారు.

దేశ ఐక్యతకు చిహ్నం జాతీయ జెండా

కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యతకు చిహ్నం జాతీయ జెండా అని, ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగరాలని కలెక్టర్ రంజిత్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా మహోత్సవం కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా 75వ స్వాతంత్ర దినోత్సవం నుంచి ప్రతి సంవత్సరం కూడా ఆగస్టు 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా మహోత్సవం కార్యక్రమాలను నిర్వహించుకుంటు న్నామన్నా రు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ బ్రిటీష్ వారిని భార తదేశం నుంచి తరిమికొట్టడానికి లక్షలాది మంది స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొంచుకున్నారని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

● సంపూర్ణతా అభియాన్ కింద కర్నూలు జిల్లాకు బంగారు పతకాన్ని నీతి అయోగ్ ప్రకటించిందని కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సంపూర్ణతా అభియాన్ సమ్మాన్ సమారోహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంపూర్ణతా అభియాన్ పథకంలో భాగంగా మద్దికెర, చిప్పగిరి, హోళగుంద మండలాల్లో నిర్దేశించిన 6 సూచికల్లో వంద శాతం ప్రగతి సాధించిన నేపథ్యంలో నీతి అయోగ్ కర్నూలు జిల్లాకు బంగారు పతకం ప్రకటించింది. ఇందుకు కృషి చేసిన కలెక్టర్, అధికారులను ఎమ్మెల్సీ బీటీ నాయుడు సన్మానించారు.

● కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం హర్‌ఘర్ తిరంగ సెల్ఫీ పాయింట్‌ను కలెక్టర్ రంజిత్ బాషా ప్రారంభించి జాతీయ జెండాను చేత బూని సెల్ఫీ దిగారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ఉన్న ఉద్యోగులంతా సెల్ఫీ పాయింట్‌లో ఫొటో తీసుకుని హర్ ఘర్ తిరంగా.కామ్ వెబ్ సైట్‌లో అప్‌లోడు చేయా లని కోరారు. జాయింట్ కలెక్టర్ బి.నవ్య వెంకటనారాయణమ్మ, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, జిల్లా టూరిజం అధికారి లక్ష్మీనారాయణ పాల్గొని సెల్ఫీ తీసుకున్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ బీటీ నాయుడు, అధికారులు

● ప్రతిఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని రక్షించడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సున యన ఆడిటోరియంలో మట్టి వినాయకున్ని పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం అనే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగను పర్యావరణానికి హానీ కలిగించకుండా జరుపుకోవాలని, రసాయనాలతో చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి విగ్ర హాలను పూజించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

● యువతలో హెచ్ఐవీ, డ్రగ్స్‌పై అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ రంజిత్ బాషా, లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ అధికారిని ఆదేశించారు. యూత్ ఫెస్ట్-2025 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని యువతీ యువకులకు 60 రోజుల పాటు హెచ్ఐవీ, డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ నాయకుడు, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం నగర టీడీపీ ఆధ్వర్యంలో థ్యాంక్యూ సీఎం సార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటానికి బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణ, న్యాయవాదులు దాశెట్టి శ్రీనివాసులు, గడిగే ప్రసాద్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన 11వ జాతీయ చేనేత దినోత్సవం వేడుకల్లో కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు విద్యుత్ వినియోగంలో రాయితీలు కల్పించడంతోపాటు ఎమ్మి గనూరు నియోజకవర్గంలో బనవాసి వద్ద 77 ఎకరాల్లో టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుందన్నారు.

కష్టపడే వారికే ఫలితాలు

డీఎస్పీ మహబూబ్ బాషా



కానిస్టేబుల్ ఫలితాల్లో ప్రతిభచూపిన అభ్యర్థులతో డీఎస్పీ మహబూబ్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కష్టపడే మనస్తత్వం ఉన్న వారే పోటీ పరీక్షల్లో రాణించగలరని కర్నూలు డీఎస్పీ మహబూబ్ బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక బిర్లాకాంపౌండులోని ఆర్ఎస్ అకాడమీలో పోలీసు కానిస్టేబుల్ ఫలితాల్లో ప్రతిభ చాటిన అభ్యర్థులకు అభినందన సభ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్ ఫలితాల్లో అకాడమీ మంచి ఫలితాలు సాధించిందన్నారు. ప్రతిభ చాటిన అభ్యర్థులను డీఎస్పీ మహబూబ్ బాషా అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రమేష్, ఫ్యాకల్టీ, అభ్యర్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గూడూరులో భారీ వర్షం

పొంగి పొర్లిన వక్కెర వాగు

గూడూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు పొంగి పొర్లాయి. గత రెండు, మూడు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురవడంతోపాటు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు వంకలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రెండు రోజులు క్రితం పెంచికలపాడు దగ్గర ఉన్న బ్రిడ్జిపై వరద వచ్చి చేరింది. సోమవారం ఉదయం బ్రిడ్జిపై వరద రావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అలాగే లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెంచికలపాడు బ్రిడ్జి ఎత్తును పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఓర్వకల్లులో పొంగిపొర్లుతున్న కుందూ వాగు



పెంచికలపాడు వక్కెర వాగుపై పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

ఓర్వకల్లు: ఓర్వకల్లు మండలంలో సోమవారం తెల్లవారుజామున వర్షం దంచి కొట్టింది. దీంతో వాగులు, వంకలు, చెరు వులు, చెక్‌డ్యాంలు నీటితో పొంగి పొర్లుతున్నాయి. ఓర్వకల్లు సమీపంలోని కుందూ వాగు నీటితో కళకళలా డుతోంది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రిన్సిపాల్ అవినీతిపై విచారణ చేపట్టాలి

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కేవీఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ లాలెప్ప చేసిన అవినీతిపై విచారణ చేపట్టాలని యూత్ కాంగ్రెస్, ఎస్ఎస్ఏ, పీఎస్ఏ విద్యార్థి సంఘాలు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర, సోషలిస్టు స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్, ప్రొగెసివ్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు, డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ నగర అధ్యక్షుడు గోవర్దన్ మాట్లాడుతూ గత ఐదు సంవత్స రాలలో ప్రిన్సిపాల్ లాలెప్ప విద్యార్థుల నుంచి స్పెషల్ ఫీజులు, అక్యు ములేషన్ ఫండ్, అడ్మిషన్ల ఫీజులను పెద్ద మొత్తంలో వసూలు చేశారని ఆరోపించారు. స్వీపర్ల జీతాలకు సంబంధించి క్యాష్ పేమెంట్ వోచర రిసిప్టులపై ఫోర్జరీ సంతకాలు చేశారని, బ్యాంకు అకౌంట్లు, పేద విద్యార్థులకు ఫీజుల రీఫండ్ చేసే విషయంలో ఫేక్ సంతకాలు పెట్టి నగదు డ్రా చేశారని ఆరోపించారు.

● ఆదర్శ డ్రైవర్ శాంతి రాజు అక్రమ రిలీవింగ్ ఆర్డర్‌ను రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ ప్రజా సంఘాలు కలెక్టర్‌ను కోరారు. ఏపీఎస్ ఆర్టీసీ ఒకటో డిపోలో విధులు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచి విధి నిర్వహణలో పనిష్మెంట్లు, అనవసరమైన సెలవులు పెట్టకుం డా ప్రయాణికులకు ఎటువంటి అవరోధాలు కలిగించకుండా డ్రైవర్ శాంతి రాజు విధులను నిర్వహించారు. ఆర్టీసీ ఆర్ఎం ఒకటో నెంబరు డిపో మేనే జర్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

● ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం కింద రైతులకు అందించే ఆర్థిక సాయం రూ.2వేలు తన ఖాతాకు ఇంతవరకు పడలేదని, వెంటనే చర్యలు తీసుకుని రూ.2వేలు ఇచ్చే విధంగా చేయాలని తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన నాగులాల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నేడు జిల్లాకు రాక

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణ మంగళవారం కర్నూలు జిల్లాకు రానున్నారని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు కాశన్న తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్ నుంచి బిర్లాగేటు వరకు ర్యాలీ ఉంటుందన్నారు. బిర్లాగేటు వద్ద ఉన్న శ్రీలక్ష్మీ కల్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస యాదవ్, శంకర్ నాయక్, బంగారి, డోన్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వన్‌టౌన్ సీఐగా పార్థసారథి

కర్నూలు క్రైం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు వన్‌టౌన్ సీఐగా పార్థసారధి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1998 బ్యాచ్‌కు చెందిన ఈయన తెలంగాణ, హైదరాబాదు సిటీల్లో ఎస్ఐగా పని చేశారు. 2006లో ఏపీకి బదిలీ అయి కర్నూలు జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో పని చేశారు. 2011లో సీఐగా పదోన్నతి పొంది ఆదోని రూరల్, త్రీటౌన్, నంద్యాల, తదితర పోలీస్ స్టేషన్లలో పని చేశారు. ప్రస్తుత సీఐగా ఉన్న రామానాయుడును డీటీసీకి బదిలీ చేశారు.

థీమ్ పార్కు పనులను త్వరగా పూర్తి చేయండి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 17వ వార్డులో నిర్మాణంలో ఉన్న థీమ్ పార్కు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేటర్ క్రైప పద్మాలతారెడ్డితో కలిసి పార్కు పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ గత కొంతకాలంగా నిర్మాణ పనులు ఆగిపోవడంతో స్థానిక కార్పొరేటర్ తన దృష్టికి తీసుకువచ్చిందన్నారు. పనులు పునఃప్రారంభిం చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ పద్మల తారెడ్డి మాట్లాడుతూ వార్డు ప్రజలకు మంచి ఆహ్లాదం ఇచ్చే థీమ్ పార్కు పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీఈఈ గిరిరాజు, ఏఈఈ రామ్మోహన్ పాల్గొన్నారు.

అనాథలను ఆదుకోవాలి

కర్నూలు కల్చరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అనాథలకు ప్రతి ఒక్కరూ సాయం అందించి ఆదుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు మురారి శంకరప్ప అన్నారు. సోమవారం నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న కీర్తన అనాథ శరణాలయంలో అనాథ పిల్లల అవసరార్థం వారు రూ.3 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దారు సయ్యద్ ఘోరీ, అనాథ ఆశ్రమ నిర్వాహకుడు విజయకుమార్ పాల్గొన్నారు.

రామాయణ గ్రంథ పారాయణం ముక్తికి మార్గం

ప్రవచన కర్త చిలకపాటి విజయరాఘవాచార్యులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీరామాయణ గ్రంథ పారాయణం ముక్తికి మార్గమని శ్రీరామాయణ ప్రవచనకర్త డాక్టర్ చిలకపాటి విజయరాఘవాచార్యులు ఉద్బోధించారు. నగర శివారు గోదా గోకుల క్షేత్రంలోని శ్రీరంగనాథ స్వామి దేవస్థానంలో గత రెండు రోజులుగా కొనసాగిన శ్రీరామాయణ పారాయణం, శ్రీరామపట్టాభిషేక మహోత్సవాలు సోమవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గోకుల క్షేత్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను నిర్వాహకులతో మాట్లాడి తెలుసు కున్నారు. టీజీ వెంకటేశ్‌ను డాక్టర్ చికపాటి విజయ రాఘవాచార్యులు సత్కరించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. సోమవారం జరిగిన శ్రీరామ పట్టాభిషేకంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శ్రీరామాయణ పారాయణం అనంతరం శ్రీరామ పట్టా భిషేకం చేయాలని సత్సంప్రదాయమని చెప్పారు. ప్రస్తుతం 170వ శ్రీరామాయణ పారాయణాలు, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని రాయలసీమ శ్రీరామానుజ సత్సంప్రదాయ దివ్యధానిగా కర్నూలులో గోదా గోకుల ప్రాంగణ శ్రీరంగనాథస్వామి సన్నిధిలో నిర్వహించడం గొప్ప విష యమని అన్నారు. గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, డాక్టర్ సీఎల్‌వీ కిరణ్ కుమార్, ఎంవీ రామారావు, గోకులం మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, ఇటిక్యాల పుల్లయ్య, పాలాది సుబ్రహ్మణ్యం, బాలసుధాకర్, ఆలయ అర్చకులు రమేష్ భట్టార్, కిరణ్ భట్టార్ పాల్గొన్నారు.



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌ను సత్కరిస్తున్న చిలకపాటి విజయరాఘవాచార్యులు

ఆలయాల నిర్మాణానికి రూ.60 లక్షలు

గూడూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంచికలపాడు గ్రామంలోని శివాలయం, అంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.60లక్షలు మంజూరైనట్లు మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్ తెలిపారు. నిధుల మంజూరుకు సహకరించిన కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిని సోమవారం జె.సురేష్ ఆధ్వర్యంలో పెంచికలపాడు గ్రామస్థులు ఆయన స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

సి.బెళగల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోటలో రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు లక్ష్మణదాసు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వామివారి రథాన్ని భక్తులు లాగారు. సర్పంచ్ శ్రీనివాసులు, హరి పాల్గొన్నారు.

కేఈ కృష్ణమూర్తిని కలిసిన నాయకులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తిని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు బొకే అందించి శాలువతో సన్మానించారు. అనంతరం జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి కేఈ అడిగి తెలుసుకున్నారు.

ఈరన్న స్వామికి పూజలు



పుష్పాలంకరణలో ఈరన్న స్వామి

సి.బెళగల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట కొట్టాలలో వెలసిన ఉరుకుంద ఈరన్నస్వామికి మూడో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అలయ నిర్వాహకుడు నాగమద్దిలేటి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రావణ మాసం మూడో సోమవారం స్వామి వారిని పల్లకిలో ఊరేగించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఉచితంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముడుమాల దాసరి వరమ్మ, ఎర్రన్న, చిన్న మద్దిలేటి, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, మధు, శేఖర్, నరసింహుడు, రామచంద్ర పాల్గొన్నారు.

43 సంఘాలకు త్రీమెన్ కమిటీలు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేల సిఫారసు మేరకు ప్రభుత్వం త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలో కోడుమూరు, లద్దగిరి, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు సంఘాలకు త్రీమెన్ కమిటీలు ఏర్పాటయ్యాయి. అదేవిధంగా నంద్యాల జిల్లాలో 39 సంఘాలకు త్రీమెన్ కమిటీలు ఏర్పాటయ్యాయి. నంద్యాల జిల్లాలో 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉండగా.. సోమవారం మూడో విడత 39 సం ఘాలకు కమిటీలను నియమించారు. కర్నూలు జిల్లాలో 43 ప్రాథ మిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉండగా.. తాజాగా నాలుగు సంఘాలకు కమిటీలను ఏర్పాటు చేశారు. ఇంకా ఆరు సంఘాలకు కర్నూలు జిల్లాలో ఎంపిక జరగాల్సి ఉంది. త్వరలోనే నామినేట్ చేసిన త్రీమెన్ కమిటీలకు సంబంధించి ప్రమాణ స్వీకారం ప్రక్రియ జరుగుతుందని కర్నూలు జిల్లా సహకార శాఖ అధికారి వెంకటకృష్ణ తెలిపారు.

పులగుమ్మి రైతులకు న్యాయం చేయాలి

కల్లూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సీతారామయ్య ఐరన్‌ఓర్ లీజు రద్దు చేసి పుల్లగుమ్మి రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కల్లూరు తహసీల్దారు కార్యాలయం ముందు రైతులతో కలిసి ధర్నా చేశారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ పచ్చని పొలాల్లో ఏమాత్రం పరిశీలన చేయకుండా ఐరన్‌ఓర్ లీజుకు ఇవ్వడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అనంతరం కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పుల్లగుమ్మి రైతులు లక్ష్మన్న, నాగరాజు, జనార్దన్, వెంకటస్వామి, రాజు పాల్గొన్నారు.

అన్ని భాషలకు సంస్కృతం తల్లివంటిది

కర్నూలు కల్చరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సంస్కృతం అన్ని భాషలకు తల్లివంటిదని స్వామి వివేకానంద సంస్కృత పాఠశాల కరస్పాం డెంట్, సీనియర్ న్యాయవాది ఎండీవీ జోగయ్య శర్మ అన్నారు. సోమవారం సంస్కృత భాషా దినోత్సవాన్ని పాఠశాల్లో ఘనంగా నిర్వహించారు. సంస్కృత భారతి చిత్రపటానికి పూజలు చేశారు. సభకు అధ్యక్షత వహించిన జోగయ్యశర్మ మాట్లాడుతూ సంస్కృత విద్యా సమాజం ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు జిల్లాలోనే ఏకైన సంస్కృత పాఠశాలుగా సేవలు అందిస్తున్నాయని చెప్పారు. అనంతరం విద్యార్థులు ఆలపించిన సంస్కృత గీతాలు, గేయాలు, దేశభక్తి పాటలు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆర్ నీలవేణి, ఎస్ఎస్‌వీ ప్రకా శ్, సంస్కృత ఉపాధ్యాయులు ఎల్లయ్య, ఎంజీఎన్ శైలజ పాల్గొన్నారు.

గూడూరులో పోలీసుల కవాతు

గూడూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో గూడూరులో ప్రధాన వీధుల్లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ పోలీసులు సోమవారం కవాతు నిర్వహించారు. ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చెత్తాచెదారం తొలగింపు


కాలువను శుభ్రం చేస్తున్న దృశ్యం

పత్తికొండ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలోని అయ్యప్ప కాంప్లెక్స్ పక్కనే ఉన్న మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని సోమవారం గ్రామ పంచాయతీ అధికారులు జేసీబీతో తొలగించారు. ఇళ్ల మధ్యనే మురుగు అనే శీర్షిక ఈనెల 8వ తేదీన ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన గ్రామ పంచాయతీ ఈఓ నరసింహులు సిబ్బందితో కలిసి మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు.

బీసీ బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి


ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి యువజన సంఘాల నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పత్తికొండలో బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి శివ, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్, మండల కార్యదర్శి అల్తాఫ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆర్డీఓ భరత్‌నాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఉపేంద్ర, రంగడు, ఇమ్రాన్, వినోద్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేస్తాం


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మద్దికెర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ స్థాయి నుంచి బీజేపీ పార్టీని బలోపేతం చేస్తామని మండల బీజేపీ అధ్యక్షులు బురుజుల శంకర్‌బాబు, మాజీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. సోమవారం మద్దికెరలో వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. మద్దికెరలో మంగళవారం తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు చాకలి శ్రీనివాసులు, నాగేష్, కురువ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

మద్దికెర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామ శివారులో ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమించుకున్నారని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు సీపీఎం మండల కార్యదర్శి కడవల రవికుమార్ ఆరోపించారు. సోమవారం తహసీల్దార్ గూండాల్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మద్దికెర తూర్పు భాగంలోని సర్వేనెం.42/1లో 54 సెంట్లు, 43/ఏలో 63 సెంట్ల భూమి స్థలాలను ఆక్రమించి, ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అధికారులు ప్రభుత్వ స్థలాలు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నీలకంఠ, సుంకన్న, చరణ్ పాల్గొన్నారు.

పీ-4 విజయవంతం చేయాలి

మద్దికెర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన పీ-4 విజయవంతం చేయాలని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్‌డీవో, ఇన్‌చార్జీ డీఎల్‌పీవో రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా వాడుకోవాలన్నారు. పీ-4లో భాగంగా ప్రజలు దత్తత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో స్వర్ణలత, ఏపీవో నర్సిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, పంచాయతీ సలహాదారులు ఆంజనేయులు ఉన్నారు.

గుంతలు పూడ్చండి



ఎంపీడీవో గోపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

దేవనకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రధాన రహదారులలో ఏర్పడ్డ గుంతలను పూడ్చాలని సీపీఐ నాయకులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు లేకపోవడంతో రోడ్లపైనే మురుగు నీరు నిల్వ ఉంటుందని సీపీఐ మండల కార్యదర్శి అన్నారు. భారీ వర్షాలు కురుస్తుడటంతో వీధులన్నీ మురుగునీటి నిల్వతో దుర్గంధం వెదజల్లడం జరుగుతుందన్నారు. దారులలో ఏర్పడ్డ గుంతలని పూడ్చి, డ్రైనేజీలు శుభ్రం చేసి, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలన్నారు. డీప్యూటీ ఎంపీడీవో గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. రవికుమార్, రాజశేకర్, కండప్ప, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా మా క్లయింట్స్ అయినా ఎం. గులాం అలీ, మరియు అతని సహోదరులు న్యూస్ పేపర్లో ఒక ప్రకటన చూసినారు. ఆ ప్రకటన అంతా అబద్ధం. అది చెల్లదు అని తెలపుకుంటున్నారు. ఇందుకు సంబందించిన నిజాలు క్రింద కనపరచున్నాము. ఆదోని మండలం మండగిరి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వ్యవసాయ భూమి సర్వే నంబరు 221బి. 222బి, 223బి మొత్తం విస్తీర్ణం 5.64 (ఐదు ఎకరాల అరవై నాలుగు సెంట్లు) భూమి క్లయింట్స్ వారికి సంబంధించినది. పైన కనపరచిన భూమి విషయంలో హజరత్ సాబ్, షేక్షావలి, ఖైరున్ బి, అనువారు ఫేక్ పట్టాదారు పాసుబుక్‌లు తీసుకున్నారని మా క్లయింట్స్‌కు తెలిసిన తర్వాత గౌరవనీయులైన ఆదోని ఆర్డీవో గారి ఆఫీస్ నందుపైన తెలిపిన వారిపై కేసు వేసినారు. కేసు నెంబరు Rc.E.893/2015గా నమోదు కాబడింది. దీనిపై విచారణ కూడా జరిగింది. విచారణ అనంతరం హజరత్ సాబ్, షేకావలి, ఖైరున్‌బి, అను వారి పేరిట ఉన్న పట్టాదారు పాసుబుక్‌లు ఆదోని ఆర్డీవో గారు తేదీ 16-2-2018 నాడు రద్దు చేసినారు. తదనంతరం మా యొక్క క్లయింట్స్ అయిన గులాం అలీ మరియు అతని సహోదరుల పేరిట కొత్త పాసుబుక్కులు మంజూరు చేసినారు. మా క్లయింట్స్ ఆయన గులాం అలీ, ఇబ్రహీం @ బాషు మరియు ఫరీద్ సాబ్ యొక్క పిల్లలు అందరు కలిసి ఈ రోజు వరకు సర్వే నెంబరు 221బి, 222బి, 223బి, మొత్త విస్తీర్ణం 5.64 (ఐదుఎకరాల అరవై నాలుగు సెంట్లు) భూమి వీరి స్వాధీన అనుభవంలో ఉన్నది.

హజరత్ సాబ్, షేక్షావలి, ఖైరున్‌బి, అనువారికి సదరు సర్వే నెంబర్ భూమికి ఎలాంటి సంబంధం లేదు కాని వీరు ఎం శ్రీనివాసులు, అనే వ్యక్తి ద్వారా అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. ఇందులో భాగంగా మా క్లయింట్స్‌కు చెందిన సర్వేనెంబర్ భూమిలో మా క్లయింట్స్ పాతించిన బోర్డును దౌర్జన్యంతో తీసి కింద పడేసినారు. పైన కనపరిచిన సర్వే నంబర్ భూమిలో మా క్లయింట్స్ అయిన ఎం గులాంఅలీ, ఇబ్రహీం @ బాషు మరియు ఫరీద్ సాబ్ భార్య పిల్లలు వారికి తప్ప ఇతరులకు ఎవరికీ సదరు భూమిపై ఎటువంటి హక్కులు లేవని ఈ న్యూస్ పేపర్ ద్వారా తెలియజేస్తున్నాము.

కె.అబ్దుల్ రషీద్, డి.సవితా రాణి, అడ్వకేట్లు, ఆదోని

ప్రజా సమస్యలను పరిష్కరించండి

● సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్


వృద్ధుడి సమస్యను వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పేర్కొన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో సబ్ కలెక్టర్ పాల్గొని డివిజన్‌లో ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధిత సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో తిమ్మక్క, ఏడీఈ సర్వేయర్ వేణు సూర్య శ్రీనివాసరాజు, ఏడీఈ బాలవర్ధిరాజు, రమాదేవి, డీటీలు బాబు, రుద్ర గౌడ్ పాల్గొన్నారు.

స్పందనలో ఒకే ఒక్కడు...

ఆలూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు మండల కేంద్రమైన ఆలూరులో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు గైర్హాజరవుతున్నారు. ఆలూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శోభానువర్ణమ్మ, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మద్దిలేటిస్వామి మాత్రమే హాజరయ్యారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయానికి ఒక్కరిద్దరూ అధికారులు అలా వచ్చి వెళ్లిపోయారు. మిగతా శాఖల అధికారులు అటువైపు చూడలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యాన్ని అధికారులు నీరుగారుస్తున్నారు. ఈ క్రమంలోనే సమస్యలు విన్నవించేందుకు వచ్చిన వైసీపీ నాయకులకు సంబంధిత అధికారులు లేకపోవడంతో ఎంపీడీవో వారికి సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. జిల్లా కలెక్టర్ దృష్టి సారించి స్పందన కార్యక్రమానికి గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకోవాలని, నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

మూలేశ్వర ఆలయంలో వరుణయాగం


వరుణయాగం చేస్తున్న సర్పంచ్ రాధమ్మ, గ్రామస్థులు

ఆస్పరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సకాలంలో వర్షాలు పడి పాడి పంటలు బాగా పండాలని ఆస్పరి మూలేశ్వర ఆలయంలో సోమవారం వరుణయాగం చేశారు. సర్పంచ్ మూలింటి రాధమ్మ అధ్యక్షతన వరుణ యాగంతో పాటు పెద్దబావి శుద్ధి, చెరువుకు జలహారతి కార్యక్రమాన్ని వేద పండితులు ఘనంగా చేశారు. బిణిగేర పంచలింగేశ్వర ఆశ్రమ గురువు శ్రీనివాస్‌నాయన, ఆస్పరి వేద పండితుడు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో గీతావాణి, రాఘవేంద్ర, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌కు అవార్డులు


అవార్డు అందుకుంటున్న రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు సందీప్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఆదోని రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలను గుర్తించి 4 అవార్డులు లభించాయని రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, అధ్యక్షుడు సైపుల్లా తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలు మొదలై 70 ఏళ్లు అయిందన్నారు. ఎన్నడలేని విధంగా నాలుగు అవార్డులు రావడం అభినందనీయమన్నారు. ప్రొద్దుటూరులో నిర్వహించిన రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 2024-25 అవార్డుల ప్రధానోత్సవంలో తుంగభద్ర జోన్ క్లబ్ ఉత్తమ అధ్యక్షుడిగా సందీప్ రెడ్డి ఉత్తమ కార్యదర్శిగా డాక్టర్ సైపుల్లా అవార్డులను డీజీ సాధు, గోపాలకృష్ణ, ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ రవి వడ్లమాని చేతుల మీదుగా అందుకున్నామన్నారు. వీటితోపాటు ఫోర్ అవెన్యూ ఆఫ్ సర్వీస్ అవార్డు, తుంగభద్ర జోన్ బెస్ట్ క్లబ్ అవార్డులు రావడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని తెలిపారు. సభ్యులు ప్రశాంత్, గాంధీ హితేష్ వినయ్ శాభీర్ పాల్గొన్నారు.

పత్తికొండ చెరువుకు హంద్రీ-నీవా నీరు

పత్తికొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజలస్రవంతి ద్వారా 68చెరువులకు నీరునింపే కార్యక్రమంలో సోమవారం పత్తికొండ చెరువులకు నీరు చేరుకున్నాయి. గతంలో వంకలద్వారా ఈచెరువుకు నీరు నింపే విధంగా డిజైన్ రూపొందించారు. అయితే మార్గమధ్యంలో రైతులు తాము సొంతంగా ఏర్పాటు చేసుకుంటున్న కుంటలకు ఆనీటిని తరలించుకుంటుండడంతో పత్తికొండ చెరువుకు పూర్తిస్థాయిలో నీరుచేరడం లేదు. దీంతో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రభుత్వంతో మాట్లాడి పైపులైన్ ద్వారా పత్తికొండ చెరువుకు నీటిని తలించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో హంద్రీనీవా ద్వారా చెరువులకు నీరు వదిలిన రెండువారాల్లో పత్తికొండ చెరువుకు నీరుచేరడంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం


ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఆదోని ఎంపీడీవో జనార్దన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నేడు జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అర్హులైన పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు దగ్గ నుంచి వేయించాలని సూచించారు. మండలంలోని పెద్దహరివానం, పెద్దతుంబళం పీహెచ్‌సీ పరిధిలో 34,260మంది 1 నుంచి 19ఏళ్లలోపు పిల్లలు ఉన్నారని, వారందరితో పాటు బయట ఉన్న పిల్లలందరికీ కూడా ఆల్‌బెండోజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలన్నారు. నులిపురుగులు ఉన్న పిల్లల్లో పోషకాహారలోపం, రక్తహీనతలతో ఎల్లప్పుడు అలసిపోతుంటారని, వారిలో శారీరక, మానసిక అభివృద్ధి మందకొడిగా ఉంటుందన్నారు. ప్రతి చిన్నారికి తప్పకుండా అధికారులు దగ్గరుండి ఆల్‌బెండోజోల్ మాత్రలు వేయించాలన్నారు. అనంతరం వైద్య సిబ్బందికి మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఇమ్రాన్, శాంతి, ఎంపీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఏఎన్ఎం సురేష్ పాల్గొన్నారు.

పత్తికొండ: పత్తికొండ పిహెచ్‌సీ పరిధిలో 15,690 పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం నులిపురుగుల నివారణ ట్యాబ్లెట్లు భోజన సమయంలో ఇవ్వడం జరుగుతుందని సూపర్‌వైజర్లు సాయిబాబా, వెంకటేశ్వర్లులు తెలిపారు.

బసవేశ్వరునికి జలాభిషేకం

మద్దికెర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బుగ్గ సంగమేశ్వరుని కోనేరు జలాలతో మద్దికెర గ్రామంలోని బసవేశ్వరుడికి జలాభిషేకం చేశా రు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో మూడో సోమవారం బసవేశ్వరస్వామి ఆలయానికి చెందిన పూజారుల ఆధ్వర్యంలో గ్రామంలోని రైతులు బుగ్గ సంగమేశ్వరునికి వెళ్లి సంగమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు

బాపురంలో పరువోత్సవం

హాలహర్వి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బాపురంలో వెలిసిన బసవేశ్వరస్వామి దేవాలయంలో పరువోత్సవం నిర్వహించారు. సోమవారం రాత్రి 8 గంటలకు జొన్నల ముద్దతో బసవేశ్వరస్వామి ఆకారం ఏర్పాటు చేశారు. ఊరంతా ఈ ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పరువోత్సవం ప్రతియేటా శ్రావణమాసంలో జరపడం ఇక్కడి సంప్రదాయం.

హర్ ఘర్ తిరంగ ర్యాలీ


బస్టాండ్ వద్ద జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

దేవనకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేవనకొండలో హర్ ఘర్ తిరంగ ర్యాలీ చేశారు. రెండు వందల అడుగుల జాతీయ జెండాతో స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ చేసి తహసీల్దార్ రామాంజినేయులు, డిప్యూటీ ఎంపీడీవో గోపాల్ మాట్లాడారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెప్పరెప్పలాడాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీమోహన్, ఏపీవో రాజునాయక్, లుముంబా, ప్రతాప్, బాబు, చంద్రన్న, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు విజయవంతం చేయాలి

వెల్దుర్తి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంతం-ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో 16 నుంచి 19వ తేదీ వరకు కృష్ణాష్టమి వేడుకలు రామళ్లకోట గ్రామంలో నిర్వహిస్తున్నట్లు మురళీకృష్ణ, రామాంజనేయులు పేర్కొన్నారు. అందరూ ఆహ్వానితులేనని శ్రీకృష్ణాష్టమి వేడుకలు విజయవంతం చేయాలని సేవాసమితి సభ్యులు వెల్లడించారు.

ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

హాలహర్వి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సాధ్యంకాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. సోమవారం మండలంలోని మల్లికార్జునపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో హామీలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అనేక కొర్రీలతో చాలామంది కుటుంబాలకు పథకాలు అందకుండా చేసిందన్నారు. అనేకమంది లబ్ధిదారులు ప్రభుత్వం తీరుపై శాపనార్థాలు పెడుతున్నారన్నారు. అందరికీ పథకాలు ఇవ్వడం దేశంలోనే వైసీపీకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామిరెడ్డి, బీసీ అధికార ప్రతినిధి అర్థగేరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్వీ విజయ మనోహరి



విజయమనోహరిని సన్మానిస్తున్న శశికళ

ఆలూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.వి.విజయమనోహరి ఎన్నికయ్యారు. సోమవారం వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కురువ శశికళ హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను సన్మానించారు. జిల్లాలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దౌర్జన్యాలపై కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని ఆమె తెలిపారు.

ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించాలి


ఎంపీడీవో మద్దిలేటిస్వామికి వినతి పత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

ఆలూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఆరంభించాలని సోమవారం వైసీపీ నాయకులు స్పందనలో భాగంగా ఎంపీడీవో మద్దిలేటిస్వామికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ పాత భవనంలో ఆసుపత్రి కొనసాగుతుండడంతో రోగులకు గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది లేక స్కావెంజర్లు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయం ముందు నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ కూడా ప్రారంభానికి నోచుకోవడంలేదని, పట్టణంలో వివిధ కాలనీల్లో ఉన్న వాటర్ ట్యాంకులు పనిచేయడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కిషోర్, గౌడప్ప, వరుణ్, రాజశేఖర్, రాజు, లారీ శేఖర్, రాజు, సాయి, మనోహర్, రమణ, గజలప్ప పాల్గొన్నారు.

43 సంఘాలకు త్రీమెన్ కమిటీలు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేల సిఫారసు మేరకు ప్రభుత్వం త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలో కోడుమూరు, లద్దగిరి, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు సంఘాలకు త్రీమెన్ కమిటీలు ఏర్పాటయ్యాయి. అదేవిధంగా నంద్యాల జిల్లాలో 39 సంఘాలకు త్రీమెన్ కమిటీలు ఏర్పాటయ్యాయి. నంద్యాల జిల్లాలో 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉండగా.. సోమవారం మూడో విడత 39 సంఘాలకు కమిటీలను నియమించారు. కర్నూలు జిల్లాలో 43 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉండగా.. తాజాగా నాలుగు సంఘాలకు కమిటీలను ఏర్పాటు చేశారు. ఇంకా ఆరు సంఘాలకు కర్నూలు జిల్లాలో ఎంపిక జరగాల్సి ఉంది. త్వరలోనే నామినేట్ చేసిన త్రీమెన్ కమిటీలకు సంబంధించి ప్రమాణ స్వీకారం ప్రక్రియ జరుగుతుందని కర్నూలు జిల్లా సహకార శాఖ అధికారి వెంకటకృష్ణ తెలిపారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

దేవనకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుంకనూర గ్రామానికి చెందిన ఈ.రామదాసుగౌడ్ (68) అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబాన్నికి అండగా ఉంటామని వాల్మీకి చైర్ పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఫార్మెటివ్ అసెస్మెంట్ పరీక్షలు ప్రారంభం

● నూతన విధానంతో విద్యార్థుల అవస్థలు


అసెస్మెంట్ ఓఎంఆర్ షీట్లను వివరిస్తున్న ఎంఈవో భూపాల్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో 1నుంచి 10 తరగతి విద్యార్థులకు ఫార్మెటివ్ అసెస్మెంట్(ఎఫ్ఏ)-1 పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పరీక్షల విధానంలో పలు సంస్కరణలు తీసుకువచ్చింది. అందులో భాగంగా విద్యార్థులు పరీక్షలు ప్రభుత్వం సరఫరా చేసిన మూల్యాంకన పుస్తకంలోనే ప్రశ్నాపత్రాలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. ఈ విధానం వల్ల చాలామంది విద్యార్థులకు జవాబులు రాసేందుకు తికమకపడ్డారు. ఇందులోనే అన్ని పరీక్షలు రాయాల్సి ఉంటుంది. దీంతో ఉపాధ్యాయులు సైతం ఒకింత అయిష్టంగానే పరీక్షలు నిర్వహిస్తున్నారు. మునిసిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న పరీక్షలను మండల విద్యాశాఖ అధికారి -1 భూపాల్ రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు పరీక్షల విధానంపై ఆయన వివరించి పలు సూచనలు చేశారు. 14వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని ఉపాధ్యాయులు జవాబులు రాసిన మూల్యాంకన పుస్తకంలో మార్కులు వేసి వారి చేత పూర్తి వివరాలను ఓఎంఆర్ షీట్ బబుల్స్ పూర్తి చేయాలన్నారు.

నర్సింగ్ పోస్టులను భర్తీ చేయాలి


నూతనంగా ఎన్నికైన నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆయా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న నర్సింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని డివిజన్ కమిటీని స్థానిక నర్సింగ్ కాలేజీలో ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా కాజా మొయినుద్దీన్, ఉపాధ్యక్షులుగా ఫయాజ్, కార్యదర్శిగా ముజీజ్ బాషా, సహాయ కార్యదర్శి రాహుల్, ట్రెజరర్‌గా తరణ్, సభ్యులుగా మల్లికార్జున, రమేష్, శ్రీధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

24వ వార్డుకు ఉప ఎన్నిక జరపాలి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 24వ వార్డు ఉప ఎన్నికను జరపాలని బాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిరాం కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వార్డు కౌన్సిలర్ అనారోగ్యంతో ఐదు నెలల కింద మృతి చెందారు. కౌన్సిలర్ లేకపోవడంతో కాలనీ అభివృద్ధి కుంటుపడిందన్నారు. కల్లుబావి, శంకర్ నగర్ పలు కాలనీలలో రోడ్లు డ్రైనేజీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

టీబీ వ్యాధిగ్రస్థులపై సమీక్ష


మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ డా. శేఖన్ భాను

ఆదోని టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అరుణ్ జ్యోతి నగర్, హనుమాన్ నగర్, షరాఫ్ బజార్ ప్రాంతాలకు సంబంధించి అర్బన్ హెల్త్ సెంటర్‌లో టీబీ వ్యాధిగ్రస్థులపై సోమవారం సమీక్షా కార్యక్రమాలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డా. శేఖన్ భాను మాట్లాడుతూ, టీబీ వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వం 100 రోజుల పాలు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఆయా వైద్య కేంద్రాల పరిధిలో ఎఎన్ఎంలతో పాటు ఆశావర్కర్‌లు, క్షేత్ర స్థాయిలో పర్యటించి టీబీ వ్యాధి బారిన పడిన వారి వివరాలను సేకరించి, వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్‌లు బాబురాజు, భాస్కర్ పాల్గొన్నారు.

వైభవంగా రాఘవేంద్ర స్వామి ఉత్సవాలు


స్వామి వారిని రథోత్సవంలో ఊరేగితున్న భక్తులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బం గారాయ ఆంజనేయ స్వామి దేవాలయంలో సో మవారం రాఘవేంద్ర స్వాముల మధ్య ఆరాధన మహోత్సవం వైభవంగా జరిగింది. రాఘవేంద్ర స్వామి బృందావనానికి పల పంచామృతాభిషేకం, విశేష ద్రవ్యములతో అభిషేకం, బెంగుళూరు నుంచి ప్రత్యేకంగా తెచ్చిన తోమాలు, పుష్పాలతో అలంకారం, రాఘవేంద్ర అష్టాక్షరి మంత్రహోమం వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం రథోత్సవాన్ని నిర్వహించారు. సర్వసేవకర్తగా పెద్ద హరివాణం రాఘవేంద్ర చారి, మఠం విచారణ కర్తలు శ్రీధర్, మేనేజర్ బీమ్సేన్‌రావు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): 12వ తేదీన (నేడు) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుహాసినమ్మ తెలిపారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ అధికారులు తమ నివేదికలతో తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు.

నీట మునిగిన పంటలకు రక్షణ చర్యలు చేపట్టాలి

తుగ్గలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు పంటలు నీట మునిగి ఉంటే ఆ నీటిని అంతా బయటకు పంపించి రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి సురేష్‌యాదవ్ తెలిపారు. సోమవారం మండలంలోని కేపి గుడిసెల, రామలింగాయపల్లె తదితర గ్రామాల్లో ఆయన పంట పొలాలను పరిశీలించి రైతులకు నీట మునిగిన పంటలను ఎలా కాపాడుకోవాలో సూచించారు.

నేడు ర్యాలీ, బహిరంగ సభ

పత్తికొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ 20వేలు అందిస్తున్న తరుణంలో పత్తికొండలో మంగళవారం అన్నదాత సుఖీభవ ర్యాలీ, బహింరగ సభ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కడవల సుధాకర్ తెలిపారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి మార్కెట్‌యార్డు వరకు ర్యాలీ ఉంటుందన్నారు.

తుగ్గలి: రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం అందడంతో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్‌లు కోరారు. సమావేశంలో నాయకులు సంగాల క్రిష్ణ, ఏకాంత్, తదితరులు ఉన్నారు.

సొసైటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి


కేడీసీసీ చైర్మన్‌ను కలిసిన ఉప్పర్లపల్లి సొసైటీ అధ్యక్షులు, సీఈవో

తుగ్గలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉప్పర్లపల్లి సొసైటీ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని ఆ సొసైటీ అధ్యక్షులు అప్పా వేణుగోపాల్, సొసైటీ సీఈవో గిడ్డయ్య కోరారు. సోమవారం కర్నూలులో కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం సన్మానించారు. అలాగే సొసైటీ సమస్యలను వివరించారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు కూడా అందేలా చూడాలని విన్నవించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మనోహర్ తదితరులు ఉన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆదోని మండలంలోని ఆరెకల్ గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలో 5, 6, 7వ తరగతులకు అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని బనవాసి గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ విద్యార్థినులకు 12 సీట్లు, ఎస్టీ విద్యార్థినులకు 5 సీట్లు, మైనార్టీ విద్యార్థినులకు 63 సీట్లు ఉన్నాయన్నారు. పాఠశాలలో మొత్తం 240 సీట్లు ఖాళీగా ఉన్నాయని అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 16న ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకోసం ఈ నంబరును (8712625067) సంప్రదించాలని తెలిపారు.

'ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి'

గోనెగండ్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మోడల్ స్కూల్ విద్యార్థుల సీట్ల సర్దుబాటు విషయంలో అవినీతికి పాల్పడిందని ప్రిన్సిపల్ ను వెంటనే సస్పెండ్ చేయాలని ఆర్‌పీఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అఫ్రిద్, ఆర్‌యూఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథ్, ఆర్‌ఎవిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాజా డిమాండ్ చేశారు. సోమవారం డిప్యూటీ డీఈవోకి వినతి పత్రం అందజేశారు. మోడల్ స్కూల్ లో సీట్ల పంపిణీ విషయంలో ప్రిన్సిపల్ అవకతవకలకు పాల్పడిందని మెరిట్ వచ్చిన విద్యార్థులకు కాకుండా మెరిట్ లేని విద్యార్థులకు సీట్లు ఇవ్వడం దారుణం అన్నారు. ఇందుకు స్పందించిన డిప్యూటీ డీఈవో విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిరని విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎద్దుల మార్కెట్ దగ్గర ఆటో బోల్తా పడి ఒకరికి గాయాలయ్యాయి. పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న తెలిపిన వివరాల ప్రకారం ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనం ముగించుకుని సొంత ఊరు గొనెగండ్లకు ఆటోలో వెళ్తుండగా ఎద్దుల మార్కెట్ దగ్గర పంది అడ్డు రావడంతో దానిని తప్పించబోయి ఆటో అదుపు తప్పి రోడ్డుకు ప్రక్కనే ఉన్న ఖాళీ స్థలంలో బోల్తా పడగా అందులోని ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. శివుడు అనే వ్యక్తికి తీవ్రమైన గాయాలు కాగా వేంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.

ఉచితంగా లింగాకర్షక బుట్టల పంపిణీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా లింగాకర్షక బుట్టలను అందజేశారు. సోమవారం కృషి విజ్ఞాన కేంద్రంలో ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, దేవనకొండ, పెద్దకడుబూరు గ్రామాల రైతులకు లూయిస్‌డ్రెఫ్యూస్ కంపెనీ(ఎల్‌డీసీ) కంపెనీ, జాగృతి ప్రాజెక్టులో భాగంగా గులాబీరంగు పురుగుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏడీఏ మహ్మద్‌ఖాద్రీ, ఏవో శివశంకర్, జాగృతి బృందం, ఎల్‌డీసీ ప్రతినిధులతో పాటు దాదాపు 500 మంది రైతులు పాల్గొన్నారు.

అడిగేవారెవరు..?



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యలను పరిష్కరించాలి. అయితే ప్రతి సోమవారం ఏర్పాటు చేసే ప్రజా సమస్యల పరిష్కారానికి కేవలం రెవెన్యూ, ఎంపీడీవో అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. సమస్యలు పరిష్కారం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ జామ్‌తో అవస్థలు

● కాలినడకన ఉరుకుందకు వెళ్లిన భక్తులు



పొలాల వెంట ఉరుకుందకు నడిచి వెళ్తున్న భక్తులు

కోసిగి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, తెలంగాణ నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తమ వాహనాల్లో ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి భారీగా భక్తులు పోటెత్తడంతో కోసిగి, జుమాలదిన్నె గ్రామాల మధ్య సుమారు 6 కిలోమీటర్ల మేర వాహనాలు భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు భక్తులు వాహనాలు రోడ్లపైనే వదిలి పొలాల వెంబడి తమ తమ సామాన్లను, నైవేద్యాలను మోసుకుంటూ ఉరుకుందకు పొలాల వెంట వెళ్లారు. వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వందలాది వాహనాలు భారీగా నిలిచిపోయాయి. కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐలు హనుమంతరెడ్డి, నిరంజన్‌రెడ్డి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మంత్రాలయంలో పార్కింగ్ కష్టాలు..

● ప్రధాన రహదారిలోనే పార్కింగ్ ● ట్రాఫిక్ నియంత్రణ పై చేతులెత్తేసిన పోలీసులు



మాధవరం రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు



పాత ఆర్‌అండ్‌బీ పార్కింగ్ స్థలంలో వాహనాలు లేని దృశ్యం

మంత్రాలయం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఉత్సవాలకు సొంత వాహనాల్లో దర్శనార్థం వచ్చిన భక్తులు తమ వాహనాలను హైవే రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. పోలీసులు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసినా వాహనాలను పార్కింగ్ స్థలాలకు తరలించడంలో పోలీసులు విఫలమతున్నారున్న విమర్శలు వినిపిస్తున్నాయి. సోమవారం.. ఉత్సవాల్లో ముఖ్యమైన రోజుల్లో మధ్యారాధన కావడం, ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకుని వచ్చి వెళ్తున్న వాహనాలు రోడ్డుకు అడ్డదిడ్డంగా ఉంచడం, వాటిని నియంత్రించాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతో హైవే రోడ్డుపై ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. పాత ఆర్‌అండ్‌బీ స్థలం, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న స్థలం, హెలిప్యాడ్ మైదానం వాహనాలు లేకుండా ఖాళీగానే దర్శనం ఇచ్చాయి. ఆ స్థలాలకు తరలించాల్సిన వాహనాలన్నీ నడిరోడ్డుపైనే నిలిపేయడంతో, ఆటోలు ఇష్టారాజ్యంగా తిప్పడం, పోలీస్ స్టేషన్ ఎదురుగానే పార్కింగ్ వాహనాలు పార్కింగ్ చేసినా అడిగేవారే లేరు. మూడు రోజుల నుంచి ప్రధాన రహదారుల్లో మోటారు సైకిళ్లు, కార్లను క్రేన్ సాయంతో తీసుకెళ్లి ఊరి బయట పెట్టి హడావుడి చేశారు. అయితే సోమవారం రోడ్డుపై ఉన్నా పట్టించుకునే వారు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చర్యలు చేపట్టాం



ప్రణాళికాబద్ధంగా స్థలాలను పార్కింగ్ కోసం సిద్ధం చేశాం. ఉదయం కురిసిన వర్షం తో పార్కింగ్ స్థలాలు కొంత బురదమయంగా మారడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడి రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. పోలీసులు నియంత్రణ చేసేటప్పటికీ వందలాది వాహనాలు రోడ్డుకిరువైపులా ఉంచి దర్శనాలకు వెళ్లారు. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు నియంత్రణ లేకుండా రాఘవేంద్ర సర్కిల్ నుంచి భక్తులు స్వేచ్ఛగా దర్శనం చేసుకునేందుకు ఏర్పాటు చేశాం.

- ఎంఎన్ భార్గవి, డీఎస్పీ, ఎమ్మిగనూరు

43 సంఘాలకు త్రీమెన్ కమిటీలు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేల సిఫారసు మేరకు ప్రభుత్వం త్రీమెన్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాలో కోడుమూరు, లద్దగిరి, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు సంఘాలకు త్రీమెన్ కమిటీలు ఏర్పాటయ్యాయి. అదేవిధంగా నంద్యాల జిల్లాలో 39 సంఘాలకు త్రీమెన్ కమిటీలు ఏర్పాటయ్యాయి. నంద్యాల జిల్లాలో 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉండగా.. సోమవారం మూడో విడత 39 సంఘాలకు కమిటీలను నియమించారు. కర్నూలు జిల్లాలో 43 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉండగా.. తాజాగా నాలుగు సంఘాలకు కమిటీలను ఏర్పాటు చేశారు. ఇంకా ఆరు సంఘాలకు కర్నూలు జిల్లాలో ఎంపిక జరగాల్సి ఉంది. త్వరలోనే నామినేట్ చేసిన త్రీమెన్ కమిటీలకు సంబంధించి ప్రమాణ స్వీకారం ప్రక్రియ జరుగుతుందని కర్నూలు జిల్లా సహకార శాఖ అధికారి వెంకటకృష్ణ తెలిపారు.

శ్రీమఠంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు



పీఠాధిపతితో కలిసి పుష్కరిణికి వెళ్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి

మంత్రాలయం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నూలు టీడీపీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి సోమవారం రాత్రి మంత్రాలయంకు వచ్చారు. ఈయనకు ఆలయ మహ ముఖద్వారం వద్ద అధికారులుఘనంగా స్వాగతం పలికారు.గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనంను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శివాంజల్, వ్యాసరాజ ఆచార్, టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్వర్లు, కేశన్న, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథరెడ్డి, రామకృష్ణ, నరసింహా, యేబు, సుంకప్ప, పైబావి నర్సారెడ్డి పాల్గొన్నారు

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దకడబూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన వైసీపీ కార్యకర్త బోయ బుడ్డోడు కు వైసీపీ యువనేత ప్రదీప్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సోమవారం బోయ బుడ్డోడు మృతి చెందాడన్న విషయాన్ని తెలుసుకున్న యువనేత ప్రదీప్‌రెడ్డి ఆ గ్రామానికి కారులో బయల్దేరారు. అయితే ఆగ్రామానికి వెళ్లే దారిలో భారీగా వర్షం కురిసి వంక ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎలాగైనా మృతుడి కుటుంబాన్ని పరామర్శించాలని ట్రాక్టర్‌పై వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి హనుమంతు, రైతు విభాగం అధ్యక్షులు యల్లప్ప, సురేష్‌గౌడ్, రామాంజిని పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



కర్నూలులోని జిల్లా వినియోగదారుల కార్యాలయంలో అధికారులతో విద్యార్థులు

ఎమ్మిగనూరు, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): కామర్స్ కోర్సు చదివే విద్యార్థులు వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల పరిష్కార కమిషనర్ జడ్జి ఎం కరణం కిషోర్ సూచించారు. సోమవారం పట్టణంలోని రావూస్ డిగ్రీకళాశాలలో చదువుతున్న బీకాం ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు వాణిజ్య శాస్త్ర విభాగం అధిపతి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కర్నూలులోని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి కరణం కిషోర్, మెంబర్ నారాయణ రెడ్డి, లాయర్స్ యునియన్ రాష్ట్ర నాయకులు కుమార్, న్యాయవాదులు అనుదీప్ రెడ్డి, శ్యామ్ కుమార్ విద్యార్థులకు వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించి అపోహలను తొలగించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్ వీరేష్ పాల్గొన్నారు.

పట్టణంలో కవాతు



కవాతు నిర్వహిస్తున్న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో పట్టణ సీఐ శ్రీనివాసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్ 99 బెటాలియన్ సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహ కల్పించడానికి స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సోమప్ప సర్కిల్, సంత మార్కెట్, శ్రీనివాస సర్కిల్, షరాఫ్ బజార్, గాంధీ సర్కిల్ మీదుగా కవాతు నిర్వహించామన్నారు. జరగబోయే గణేష్ ఉత్సవాలు, శ్రావణమాస ఉత్సవాలు, మంత్రాలయంలో జరుగుతున్న ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి సంఘటనలు జరగకుండా, ప్రజలకు పోలీసులు అండగా ఉన్నారనే భరోసా కల్పించడంలో కవాతు ఒక భాగమని అన్నారు. అత్యాధునిక ఆయుధాలతో 99 బెటాలియన్‌కు చెందిన 48 ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది కవాతులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సీఐలు రాజు, భార్గవి ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగులు

● గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
● ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు



పొంగి పొర్లుతున్న చాపవంక



ఉధృతంగా ప్రవహిస్తున్న మల్లెల వంక వాగు

కోసిగి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కోసిగిలో కుండపోత వర్షానికి ఉరుకుంద రోడ్డులో ఉన్న చాపవంక పొంగి పొర్లింది. దీంతో ఉరుకుందకు వెళ్లే భక్తుల వాహనదారులు నీటి ప్రవాహానికి భయపడి రోడ్డుపైనే నిలిచిపోయారు. దీంతో గంటసేపు భక్తుల వాహనాలు వంక ఆవతలివైపు నిలబడిపోవడంతో కోసిగిలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజహళ్లి గ్రామ శివార్లలో ఉన్న మల్లెవంక వాగు సోమవారం పొంగిపొర్లింది. గ్రామ శివార్లలో ఉన్న బ్రిడ్జి పైకి ఎక్కి నీరు ప్రవహించింది. దీంతో కొద్దిసేపు గంజహళ్లి, బైలుప్పల, అగ్రహారం, తెర్నెకల్లు, తదితర గ్రామాల రాక పోకలు నిలిచిపోయాయి. ఆదోని, ఆస్పరి, తదితరప్రాంతాలోల వర్షాలు భారీగా కురియడంతో వరదనీరు మల్లెలవంకవాగుకు చేరాయి. దీంతో వంక పొంగిపొర్లింది. మల్లెలవంక ద్వార వచ్చిన నీరు గాజులదిన్నె ప్రాజెక్టులోకి కలిశాయి.

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో బ్యాలెట్ బాక్స్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఖాశింవలి నిరసన చేశారు. దేశంలో ఎన్డీయే ప్రభుత్వం గత ఎన్నికల్లో దొంగ ఓట్లతో, ఈవీఎం ట్యాంపరింగ్‌లతో అధికారం చేపట్టిందన్నారు. దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో ఈవీఎం ట్యాంపరింగ్‌లు, దొంగ ఓట్లు వేస్తున్నారన్నారు. ఆదాని, అంబానీలతో కుమ్మక్కై దేశంలో మూడవసారి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ కలిసి అనేక అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్, షబ్బీర్, హనీఫ్, ఖాసీం, భాస్కర్, అజయ్ పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



ధ్వంసమైన డ్రైనేజీని చూపిస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ కాలనీ లో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఎం నాయకులు రాముడు, కృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి పేదల కోసం నిర్మించిన కాలనీలో మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని దుయ్యబట్టారు. 5,6వ వార్డులలో రోడ్లు, డ్రైనేజీలు అధ్వాన స్థితిలో ఉన్నాయని కాలనీ వాసులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా మౌలిక వసతుల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు మరమ్మతులు చేయాలి

పెద్దకడబూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కల్లుకుంట-పెద్దకడబూరు బైపాస్ రోడ్డులో ఏర్పడ్డ గుంతలను పూడ్చి మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకులు తిక్కన్న, దాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని పీజీఆర్‌ఎస్‌లో సీపీఎం నాయకులు ఈవోపీఆర్డీ జయరాముడుకు వినతి పత్రం అందజేశారు. కల్లుకుంట గ్రామ సచివాలయంలో సిబ్బంది కొరతను తీర్చాలన్నారు. అలాగే గ్రామంలోని సీసీ రోడ్డు, డ్రైనేజ్‌లను వేంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అన్వర్‌బాష, రాజు పాల్గొన్నారు.

గీతా మందిర్‌లో 18 రోజుల గీతా యజ్ఞం

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గీతా మందిర్‌లో 18 రోజుల గీతా యజ్ఞం నిర్వహించబోతున్నట్లు గీతా మందిర్ ప్రధాన కార్యదర్శి ఉరుకుందప్ప తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక గీతా కాలనీలోని గీతా మందిర్‌లో ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణార్థం కోసం ప్రతీ సంవత్సరం మాదిరిగానే శ్రావణమాసం పురస్కరించుకుని ఈ నెల 13వ తేది బుధవారం నుంచి 30వ తేది వరకు గీతా యజ్ఞము నిర్వహిస్తున్నమన్నారు. ఈ గీతా యజ్ఞం కోసం కామవరం శ్రీ గురు శివరామ అవధూత ఆశ్రమ అధ్యక్షులు శ్రీ శ్రీ అవ్యక్తానంద సరస్వతీ స్వాములు వారి ప్రవచనాలతో 18 రోజులు గీతా యజ్ఞం చేస్తున్నారన్నారు, కావున ఈ గీతా యజ్ఞంలో పాల్గొను దంపతులు వారి పెర్లను రూ వెయ్యి చెల్లించి నమోదు చేసుకొవాలని కొరారు. అలాగే ఈ నెల 16వ తేదిన కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని కావున భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.

ఘనంగా మార్కండేయస్వామి రథోత్సవం



కోసిగిలో రథోత్సవంలో పాల్గొన్న పద్మశాలీయులు

కోసిగి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలో వెలసిన పద్మశాలీయుల కులబాంధవుల ఆరాధ్య దైవం భక్త మార్కండేయ స్వామికి మూడు రోజుల నుంచి విశేష పూజలు నిర్వహించారు. సోమవారం శ్రావణమాస ఉత్సవాల్లోభాగంగా మార్కండేయ స్వామిని రథోత్సవంలో అధిష్టించి పురవీధుల గూండా ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకులు వీరేష్ స్వామి, వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మార్కండేయ స్వామి ఉత్సవమూర్తిని మంగళవాయిద్యాలు, భజనలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం పద్మశాలీయుల కులబాంధవులు రథోత్సవంలో మహిళలు పెద్దలు, పిల్లలు పాల్గొన్నారు

జీడీపీకి చేరుతున్న వరద నీరు



నిండుకుండలా జీడీపీ

గోనెగండ్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా లోని ఏకైక మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టు సంజీవయ్యసాగర్(జీడీపీ)గత రెండు మూడు రోజులుగా వరద నీటితో కళకళలాడుతుంది. సోమవారం ఒక్కరోజే ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి దాదాపు 2000 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు ను చేరింది. హంద్రీనీవా నుంచి రోజుకు 160 క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో ప్రాజెక్టు ఒక్క సారిగా జల కళ సంతరించుకుంది. మూడేళ్లుగా వరద నీరు రాలేదు. ఈ ఏడాది ఆగస్టు 11 వ తేదిన నాటికి 2 టీఎంసీ (గ్రాస్) కు చేరింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, రాతన, తదితర ప్రాంతాలలో వర్షం పడటం తో వరద నీరు వస్తోంది. తెర్నెకల్లు వంక వృద్ధుతంగా ప్రవహించడం వల్ల ఆ జలాలు కూడా జీడీపీ ని చేరుతున్నాయి. ఇక వచ్చే రబీకి నీటి కష్టాలు తీరుతాయని ఆయకట్టు రైతుల ఆశాబావం వ్యక్తం చేస్తున్నారు.